కోటగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో..
వీక్షించండి చానల్
NS99 CHANNEL
దగా స్థానంలో నిగా వేసే చానల్

దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

నీలగిరి శంఖారావం

సమగ్ర సమాచార దర్శిని

తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ | సంపుటి :05 | సంచిక :173 | ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్ | శుక్రవారం 30-10-2026 | పేజీలు : 4 | వెల : రూ. 3/-

జవహర్‌నగర్ డంపింగ్ యార్డుపై శాశ్వత పరిష్కారం చూపండి



హైదరాబాద్, జవహర్‌నగర్ డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం చేయాలని, కేంద్రం నుంచి అవసరమైన నిధులు తీసుకొచ్చే బాధ్యత తాను తీసుకుంటానని ప్రకటించారు. డంపింగ్ యార్డు పరిసర ప్రాంతాల ప్రజల ఆరోగ్యం, జీవన ప్రమాణాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. డంపింగ్ యార్డును తరలించాలనే డిమాండ్‌తో ఆయన చేపట్టిన 'జవహర్‌నగర్ జన సంకల్ప యాత్ర' మూడో రోజు కీసర నుంచి ప్రారంభమైంది.

ప్రజారోగ్యాన్ని విస్మరించొద్దు

కీసరలో పాదయాత్రకు స్థానిక ప్రజలు, డంపింగ్ యార్డు బాధితులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఈటల రాజేందర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు స్వచ్ఛమైన గాలి, నీరు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులకు భంగం కలగకుండా చూడాలని పేర్కొన్నారు. డంపింగ్ యార్డు పరిసరాల్లో నివసించే నిరుపేదలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈటల రాజేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలు బయటకు వెళ్లలేని పరిస్థితులు ఉన్నాయని, వీధికుక్కల బెడద వంటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. బాధిత కుటుంబాల జీవన పరిస్థితులను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు.

'డీపీఆర్ సిద్ధం చేయండి.. నిధులు తెస్తా'

జవహర్‌నగర్ డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం సాధ్యమనే నమ్మకంతోనే పాదయాత్ర చేపట్టినట్లు ఈటల రాజేందర్ తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఎంపీగా తాను రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నానని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డీపీఆర్ సిద్ధం చేస్తే, అవసరమైన నిధులను కేంద్రం నుంచి తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి సుమారు రూ.2 వేల కోట్లు ఖర్చు చేయలేని ప్రభుత్వం, మూసీ ప్రక్షాళనకు లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తామంటే ఎలా నమ్మాలని ప్రశ్నించారు. ఇతరులపై నిందలు వేయడం తన ఉద్దేశం కాదని, సమస్యకు పరిష్కారం చూపించడమే లక్ష్యమని స్పష్టం చేశారు.

చెత్త నుంచి సంపద సృష్టించాలి

ప్రపంచవ్యాప్తంగా చెత్తను వనరుగా మార్చే సాంకేతికత అందుబాటులో ఉందని ఈటల రాజేందర్ అన్నారు. చెత్తను రీసైక్లింగ్ చేయడం ద్వారా వృథాను తగ్గించి, ఉపయోగకరమైన ఉత్పత్తులను తయారు చేయవచ్చని పేర్కొన్నారు. డంపింగ్ యార్డు నిర్వహణను కేవలం ఆదాయం, ఖర్చుల కోణంలో కాకుండా ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ కోణంలో చూడాలని సూచించారు. డంపింగ్ యార్డు నిర్వహణలో రాంకీ సంస్థ తీరుపైనా ఆయన విమర్శలు చేశారు. చెత్త నిర్వహణ సరిగా జరగడం లేదని ఆరోపించారు. ఈ అంశంపై సంబంధిత అధికారులు సమగ్రంగా పరిశీలించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

కలుషిత నీటితో ప్రజలకు ఇబ్బందులు

డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న లీచేట్ (చెత్త నుంచి వెలువడే కలుషిత ద్రవం) కారణంగా పరిసర ప్రాంతాల్లోని చెరువులు కలుషితమయ్యాయని ఈటల రాజేందర్ ఆరోపించారు. బోర్లలోనూ పచ్చటి రంగులో నీరు వస్తోందని, దీంతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. నీటి కాలుష్యంపై తగిన పరీక్షలు నిర్వహించి, ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'ప్రజల జీవితాలతో చెలగాటమాడొద్దు'

డంపింగ్ యార్డు సమస్యతో లక్షలాది మంది ప్రజల జీవన ప్రమాణాలు, ఆరోగ్యం ప్రభావితమవుతున్నాయని ఈటల రాజేందర్ అన్నారు. ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం వారి సమస్యలను విస్మరించకూడదని వ్యాఖ్యానించారు. ప్రజలను నిచ్చెన మెట్లుగా ఉపయోగించుకొని వదిలేయవద్దని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి అన్నారు. తాను ఆరుగురు ముఖ్యమంత్రులతో పోరాడిన అనుభవం ఉన్న వ్యక్తినని పేర్కొన్న ఈటల రాజేందర్.. జవహర్‌నగర్ డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి కేంద్రం నుంచి అవసరమైన సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. డంపింగ్ యార్డును తరలించే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

రేపటి బహిరంగ సభకు రావాలని పిలుపు

జవహర్‌నగర్ డంపింగ్ యార్డు బాధితులు, పరిసర ప్రాంతాల ప్రజలు తమ పోరాటంలో భాగస్వాములు కావాలని ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు. జవహర్‌నగర్‌లో మరుసటి రోజు నిర్వహించనున్న బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని కోరారు. డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.

జర్మనీలో ఉద్యోగమని చెప్పి ఓ యువకుడి చేతికి కత్తి ఇచ్చారు..



హైదరాబాద్,కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న టామ్‌కామ్ స్కామ్ ను బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బయటపెట్టారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ టామ్‌కామ్ గురించి టామ్‌టామ్ చేస్తూ రోజూ మంత్రి వివేక్ వెంకటస్వామి తిరుగుతున్నారు. ఆయన దక్షిణ కొరియా పోతున్నారు.. జపాన్ పోయారు.. మొన్ననే జర్మనీ కూడా పోయొచ్చారు.. మరి జర్మనీకి వాళ్ల ఫ్రీగా అయితే పోరు.. ప్రభుత్వ ఖర్చుతో ప్రజల కష్టార్జితంతో మంత్రి, ఆయనతోపాటు కొంతమంది అధికారులు వైట్ పాస్‌పోర్టుతో ప్రభుత్వ ఖర్చుతో వీళ్లు విదేశాలకు పోయి వస్తారు.. దీనికి కోట్ల రూపాయలు ఖర్చై ఉంటయన్నారు.ఈ టామ్ కామ్ సంగతేంటి.. వీళ్లకు జరిగిన బాధేందనేది తెలంగాణ ప్రజల ముందర ఏకరువు పెట్టాల్సిన సమయం ఆస్ననమైంది..తెలంగాణలో నిరుద్యోగులు దాదాపు 40 లక్షల మంది ఉన్నారు.. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వెబ్‌సైట్ చూస్తూ మీకర్థమవుతుంది. గ్రాడ్యుయేషన్ లేకున్నా కూడా ఉద్యోగాలకు అప్లై చేసుకున్న వాళ్లు 20 లక్షల వరకు ఉంది. ఏ ప్రభుత్వం కూడా అందరికీ అన్ని ఉద్యోగాలు కల్పించలేదు.

ఒక ఉద్యోగం అని చెప్పి మరో ఉద్యోగం ఇప్పించి..

ఇంజినీర్ ఉద్యోగాలని చెప్పి యువకులను జర్మనీకి పంపించి మటన్ షాపులో పని చేయిస్తున్నారు. ఐవీజూవీ పేరిట నిరుద్యోగుల నుంచి మంత్రి వివేక్ వెంకటస్వామి డబ్బులు వసూలు చేస్తున్నాడని ఆరోపించారు. నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు విదేశాలకు పంపించాలనే ఉద్దేశంతో 2014లో ఐవీజూవీ ఏర్పాటు చేశారు. ఒక ఉద్యోగం అని చెప్పి మరో ఉద్యోగం ఇప్పించి బ్రోకర్లు అందరినీ మోసం చేస్తున్నారని, ఇవన్నీ జరగకూడదనే గత ప్రభుత్వం ఈ నంస్థను ఏర్పాటు చేసిందన్నారు.జర్మనీలో ఉద్యోగాలు, వాటికి కావాల్సిన నైపుణ్యాల గురించి ఐవీజూవీ ఇటీవల ప్రకటనలు ఇచ్చింది. ప్రకటనలు రాగానే వందలాది మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. ఉచితంగా కల్పించాల్సిన అవకాశాల కోసం ఒక్కో నిరుద్యోగి నుంచి రూ.4.10 లక్షలు వసూలు చేశారు. ఈ నిరుద్యోగులతో పేరు లేకుండా Fair Street అనే సంస్థ పేరు మీద ఉన్న అగ్రిమెంట్లపై సంతకాలు చేయించారు. 200 మంది దగ్గర డబ్బులు వసూలు చేసి కనీసం 10 మందిని కూడా జర్మనీకి పంపించలేదని ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు. ఒక నిరుద్యోగ యువకుడికి మెకాట్రానిక్స్ విభాగంలో ఉద్యోగం అని చెప్పి జర్మనీకి పంపించారు.. కానీ అక్కడికి వెళ్లాక బీఫ్, మటన్, ఇతర మాంసం కట్ చేయాలని అతని చేతికి కత్తి ఇచ్చారుఅక్కడికి వెళ్లిన యువ కులందరిదీ ఇదే పరిస్థితి. వివేక్ వెంకటస్వామి తన కొడుకు గడ్డం వంశీకృష్ణను కూడా ఇలాగే పంపిస్తాడా..? అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు.

కేటీఆర్‌కు మంత్రి కొండా సురేఖ క్షమాపణలు



హైదరాబాద్:బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై గతంలో చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నట్లు మాజీ మంత్రి కొండా సురేఖ ట్విట్టర్ వేదికగా వెల్లడించారు.కొంతకాలం క్రితం అక్కినేని నాగచైతన్య – సమంతల విడాకుల వ్యవహారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని మంత్రి కొండా సురేఖ సంచలన ఆరోపణలు చేశారు. ఈ వ్యాఖ్యలపై టాలీవుడ్ ప్రముఖులంతా తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నాగార్జున కుటుంబంతో పాటు, కేటీఆర్ కూడా సురేఖపై పరువు నష్టం దావా వేశారు. కోర్టు విచారణ, న్యాయపరమైన చర్యలు వేగవంతం అవ్వడం, మరోవైపు రాజకీయంగా కూడా విమర్శలు వెల్లువెత్తడంతో ఈ వివాదం అప్పట్లో పెద్ద దుమారమే రేపింది.పరువు నష్టం దావాలు, తీవ్ర ఒత్తిళ్ల నేపథ్యంలో మంత్రి కొండా సురేఖ ఈ వివాదంపై వెనక్కి తగ్గారు. కేటీఆర్, ఆయన కుటుంబ సభ్యులపై గతంలో తాను చేసిన వ్యక్తిగత, నిరాధార వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నట్లు ట్విట్టర్ (ఎక్స్) వేదికగా ప్రకటించారు. కేవలం అప్పటి రాజకీయ పరిస్థితుల వల్ల, ప్రతిపక్షాన్ని విమర్శించే క్రమంలోనే ఆ మాటలు అన్నానని, వారిని వ్యక్తిగతంగా బాధపెట్టాలన్న దురుద్దేశం తనకు లేదని స్పష్టం చేశారు. కొన్ని వ్యాఖ్యలు నిరాధారమైనవని, అలా మాట్లాడకుండా ఉండాల్సిందని పేర్కొన్నారు. తన మాటల వల్ల వారి కుటుంబం నొచ్చుకుని ఉంటే చింతిస్తున్నానని విచారం వ్యక్తం చేస్తూ ఈ వివాదానికి ముగింపు పలికే ప్రయత్నం చేశారు.

పబ్లిక్ గొంతు నొక్కడం ఏ రకమైన పబ్లిక్ హియరింగ్ అవుతుంది



హైదరాబాద్, తెల్లారి లేస్తే రాజ్యాంగాన్ని పట్టుకొని పోజులు కొట్టే రాహుల్ గాంధీ మీ కాంగ్రెస్ పాలిత రాష్ట్రంలో ఏం జరుగుతుందో మీకు సోయి లేదా.. పబ్లిక్ హియరింగ్ అని చెప్పి.. పబ్లిక్ గొంతు నొక్కడం ఏ రకమైన పబ్లిక్ హియరింగ్ అవుతుందని బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కరువులో రాష్ట్రం ఉంటే సుందరీకరణ పేరుతో డ్రామాలు మీరే చెప్తున్నారు.. కరువు నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి ఊళ్లల్లో నాటకాలు వేయాలంట.. జానపదాలు పాడాలంట.. పద్యాలు పాడాలట.. డ్రామాలు చేయాలట. ఇక్కడ మాత్రం మూసీలో లక్షన్నర కోట్ల లూటీకి ముఖ్యమంత్రి తెరలేపారని అన్నారు.ఆయనకు రియల్ ఎస్టేట్ తప్ప ఏం తెలియదని ముఖ్యమంత్రి స్వయంగా చెప్పారు.. రియల్ ఎస్టేట్ అంటేనే రేవంత్ రెడ్డి.. రేవంత్ రెడ్డి అంటేనే రియల్ ఎస్టేట్ అని అంటరు.. అని అంటరని కేటీఆర్ గుర్తు చేశారు. ఇవాళ అధికారుల నుంచి మాకు అందుతున్న సమాచారం ప్రకారం మూసీ ప్రాజెక్టు ముసుగులో వేలాది ఎకరాల లూటీకి ఈ ముఖ్యమంత్రి తెరలేపారు.అందుకే పబ్లిక్ హియరింగ్ అంటే ఉలిక్కి పడుతున్నరు..అందుకే పబ్లిక్ హియరింగ్ అంటే ఉలిక్కి పడుతున్నరు.. భయపడుతున్నరు.. పబ్లిక్ రాకుండా తూతూ మంత్రంగా ఏదో త్వరలో రాజీవ్ యువ వికాసం పథకం ప్రారంభం కాబోతుంది. మారుతున్న కాలానికి అనుగుణంగా కుల వృత్తులు మారాలి. కుల గణన చేశాం.. రాష్ట్రంలో ఎంత జనాభా ఉందని ప్రామాణిక లెక్కలు ఉన్నాయి. కుల సర్వే నివేదిక ఆధారంగా ఎక్కడైతే ఉన్నత కుటుంబాలు ఉన్నాయో వాటికి కారణం ఏంటని పరిశీలిస్తే ఉన్నత చదువులు చదివిన కుటుంబాలే ఆర్థికంగా మంచి స్థానంలో ఉన్నాయి. గుజరాత్ లోని పాటిదర్ భవన్ లో వారికి నాణ్యమైన శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు వచ్చేలా చేస్తున్నారు. బీసీ స్టడీ సర్కిల్ లో సంస్కరణలు చేస్తున్నాం..మా పిల్లలకు శిక్షణ ఇప్పించండి. ముఖ్యమంత్రి చెప్పినట్టు ఒకప్పుడు ఇచ్చినట్టు ప్రజలకు ఇవ్వడానికి ప్రభుత్వం దగ్గర భూములు ,ధనం లేదు భవిష్యత్ పెట్టుబడి విద్య మాత్రమే ప్రభుత్వం అందిస్తుంది అని తెలిపారు

అనిరుధ్ రెడ్డి వ్యాఖ్యలపై పీసీసీ చీఫ్ సీరియస్.. త్వరలో నోటీసులు!



హైదరాబాద్,ఎమ్మెల్యే అనిరుధ్ వ్యాఖ్యలపై పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సీరియస్ అయ్యారు. ఒక్క జడ్చర్లలోనే బిల్లులు చెల్లించలేదనడం సరికాదని రాష్ట్రంలో చాలా చోట్ల నిధుల కొరత ఉందన్నారు.ఇవాళ గాంధీ భవన్ లో మీడియాతో మాట్లాడిన ఆయన.. పలు అంశాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా 'జడ్చర్లలో నేను చనిపోతేనే బిల్లులు ఇస్తారా? అలాగైతే నేను నియోజకవర్గ అభివృద్ధి కోసం చావడానికి సిద్ధం' అంటూ ఇటీవల అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. కేవలం జడ్చర్లలోనే బిల్లులు చెల్లించలేదనడం సరికాదని, రాష్ట్రంలో చాలా చోట్ల నిధుల కొరత ఉందన్నారు. అనిరుధ్ రెడ్డి వ్యాఖ్యల అంశాన్ని క్రమశిక్షణ కమిటీ చూసుకుంటుందన్నారు. పీసీసీ వ్యాఖ్యల నేపథ్యంలో త్వరలోనే అనిరుధ్ రెడ్డి నోటీసులు ఇచ్చే అవకాశం ఉంది.

బ్యాలెట్‌తో బుల్లెట్ దించాం:

బ్యాలెట్ తో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎన్ని సీట్లు గెలుచుకుంది అంటూ ప్రధాని నరేంద్ర మోడీ చేసిన సెటైరికల్ ట్వీట్ పై మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. ' రాజకీయాల్లో ఎన్ని సీట్లు గెలిచామన్నది కాదు, ఎక్కడ గెలిచామన్నది ముఖ్యం. మోడీనే కాదు మోడీ అబ్బను కూడా ఓడిస్తామని మొన్న ఖర్గే చెప్పారు. బీజేపీ అబ్బ అయిన =నా హెడ్ క్వార్టర్ నాగ్ పూర్?లో బీజేపీని ఓడించాం. బ్యాలెట్ ద్వారా బీజేపీకి బుల్లెట్ దింపాం' అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీకి ప్రెస్ మీట్లు పెట్టి జర్నలిస్టుల ప్రశ్నలను ఎదుర్కొనే ధైర్యం లేదని అందుకే కేవలం సోషల్ మీడియాలో పోస్టులు మాత్రమే చేస్తుంటారని విమర్శించారు.

'సర్' ప్రక్రియ దేశంలో అలజడి సృష్టించింది:

సర్ ప్రక్రియతో దేశంలో అలజడి సృష్టించిందన్నారు. నవంబర్ 1 న ఢిల్లీ ర్యాలీకి వెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీ స్పెషల్ ట్రైన్స్ కోసం అర్జీ పెట్టుకుంటే కుంటిసాకులతో ఇవ్వడం లేదని మరేశ్ కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే సౌత్ సెంట్రల్ రైల్వే గతంలో మేము బీసీ ధర్నాకోసం ఢిల్లీకి వెళ్లేందుకు మూడు రోజుల ముందు దరఖాస్తు పెట్టుకుంటే రైళ్లు ఇచ్చారని గుర్తు చేశారు.

కాలానికి అనుగుణంగా కుల వృత్తులు మారాలి



హైదరాబాద్:మున్నూరు కాపు ఆత్మ గౌరవ భవనానికి ప్రభుత్వం 5 కోట్లు కేటాయించడం జరిగింది.. నిర్మాణాలు త్వరగా ప్రారంభించి పూర్తి చేసుకోవాలి.. అదనంగా ఇవ్వడానికి ముఖ్యమంత్రి సానుకూలంగా ఉన్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కోకాపేట లో మున్నూరు కాపు ఆత్మ గౌరవ భవన నిర్మాణానికి 5 కోట్లు కేటాయించినందున జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే కల్చరల్ సెంటర్ లో మున్నూరు కాపు ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు కార్యక్రమం గురువారం జరగింది. ముఖ్య అతిధిగా మంత్రి పొన్నం హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ , ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ గద్వాల విజయ లక్ష్మీ ఎమ్మెల్సీ దండే విఠల్,మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ , కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్ ,వినయ్ కుమార్, బొంతు రామ్మోహన్, గాలి అనిల్ కుమార్, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాల మాయాదేవి, ఇతర ముఖ్య నేతలు,అధికారులు పాల్గొన్నారు.మంత్రి పొన్నం మాట్లాడుతూ కులంలో ఐక్యత ఉండాలి .. ఉన్నత స్థితిలో ఉన్న వారు కుల అభివృద్ధికి ఉపయోగపడాలి. నేను వేములవాడ వెళ్ళినప్పుడు మున్నూరు కాపు సత్రంలోనే ఉండేది. దాతల సహాయంతో 40 ఏసీ రూమ్ లతో వేములవాడ లో గౌడ సత్రం నిర్మించాం.. అందరికీ చాలా బాగా ఉపయోగపడుతుంది. మున్నూరు కాపు కార్పొరేషన్ ద్వారా యువకులకు ఎలాంటి కార్యక్రమాలు చేస్తే వృత్తి పరమైన నైపుణ్యాలు పెంచడం.. స్వయం ఉపాధి నైపుణ్య శిక్షణలు ఇచ్చి ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడానికి ప్రత్యేక కార్యాచరణ తీసుకుంటాం.

కవిత సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్,జనగణన-2027లో ఓబీసీల కోసం ప్రత్యేకంగా కులాల జాబితాతో కూడిన డ్రాప్‌డౌన్ ఆప్షన్‌ను ముందుగానే చేర్చాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారించేందుకు నిరాకరించడంపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పందించారు. ఇది విధానపరమైన నిర్ణయమని కోర్టు పేర్కొన్నప్పటికీ.. ఏ వర్గాన్ని లెక్కల్లోకి తీసుకుంటారో ఆ వర్గానికే గుర్తింపు లభిస్తుందని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఆమె సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. ఓబీసీ రిజర్వేషన్లను సమర్థించుకోవడానికి న్యాయస్థానాలు అనుభవపూర్వక గణాంకాలను కోరుతున్నాయ



సంపాదకీయం

శుక్రవారం 30-10-2026

లక్షల మంది ఫాలోవర్లు.. 33 ఓట్లు!

మెరిసేదంతా బంగారం కాదు..అన్నమాట.. తాజాగా ఎన్నికల్లో చూస్తే తెలిసొస్తుంది. సోషల్ మీడియాలో 21 లక్షల మంది మనల్ని ఫాలో అవుతుంటే.. మనం ఒక గ్రామానికి సర్పంచ్ కావడం పెద్ద కష్టమేమీ కాదని అనిపించొచ్చు. కానీ రాజస్థాన్‌కు చెందిన ఓంప్రకాశ్ బిష్ణోయ్‌కు ఓటర్లు ఒక చిన్న సందేశం ఇచ్చారు. .ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్‌లలో కలిపి 21 లక్షలకు పైగా ఫాలోవర్లు ఉన్న ఈ జ్యోతిష్యుడికి సర్పంచ్ ఎన్నికల్లో దక్కినవి కేవలం 33 ఓట్లు. .ఓంప్రకాశ్‌కు ఇన్‌స్టాగ్రామ్‌లో 14 లక్షలకు పైగా ఫాలోవర్లు, ఫేస్‌బుక్‌లో 2 లక్షలకు పైగా అనుచరులు, యూట్యూబ్‌లో సుమారు 5.5 లక్షల మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. ఈ సంఖ్యలన్నీ కలిపి చూస్తే, ఆయన ఎన్నికల ప్రచారానికి బయలుదేరినప్పుడు ఊరంతా కాదు, ఊళ్లన్నీ కదిలివస్తాయని ఎవరైనా అనుకోవచ్చు. కానీ ఆయన పోటీ చేసింది రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ జిల్లా ఓసియాన్ తహసీల్ పరిధిలో ఉన్న ఇండోన్ కీ ధానీ-ఎఎ గ్రామ పంచాయతీలో. ఓటర్లు సుమారు 1,600 మంది. వచ్చిన ఓట్లు 33.మరో అభ్యర్థి అయిన ఉపాధ్యాయుడికి 527 ఓట్లు వచ్చాయి. చివరకు కార్ల వ్యాపారం చేసే అభ్యర్థి సర్పంచ్‌గా గెలిచారు. ఈ ఫలితాన్ని చూస్తే ఒక విషయం అర్థమవుతుంది. ఇంటర్నెట్‌లో జనాన్ని సంపాదించడం ఒక కళ కావచ్చు. కానీ ఎన్నికల్లో జనాన్ని సంపాదించడం మరో కళ. మొదటి కళకు మంచి కెమెరా, ఆకర్షణీయమైన వీడియో, సరైన అల్గారిథమ్ సరిపోవచ్చు. రెండో కళకు మాత్రం ప్రజలు మిమ్మల్ని నమ్మాలి. ఆ నమ్మకాన్ని డబ్బు పెట్టి కొనలేరు, ఫాలోవర్ల సంఖ్య చూపించి అప్పుగా తీసుకోలేరు.ఓంప్రకాశ్ జ్యోతిష్యుడు. ఓంప్రకాశ్ సుమారు 1,500 ఆవులున్న గోశాలను నిర్వహిస్తున్నానని, దాని కోసం 30 బిగాల భూమిని దానం చేశానని తెలిపారు. సర్పంచ్‌గా గెలిస్తే ప్రతి చిన్నారికి విద్య అందించడం, అనాథ జంతువులను ఆదుకోవడం, ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేలా చూడటం తన లక్ష్యాలని చెప్పారు. గ్రామస్థులే తనను ఎన్నికల్లో పోటీ చేయమని ప్రోత్సహించారని కూడా వెల్లడించారు.ఇవన్నీ మంచి పనులే కావచ్చు. కానీ మంచి పని చేశామని చెప్పడం, ఆ పనుల ఆధారంగా ఓట్లు సంపాదించడం రెండూ వేర్వేరు విషయాలు. గోశాలలోని ఆవులు మనం చేసిన సేవకు సాక్షులుగా నిలబడవచ్చు. కానీ అవి పోలింగ్ బూత్‌కు వెళ్లి ఓటు వేయలేవు. సోషల్ మీడియాలోని ఫాలోవర్లు కూడా అదే పని చేశారు. తెర మీద కనిపించారు. ఓట్ల లెక్కలో మాత్రం కనిపించలేదు.గ్రామస్థులు పోటీ చేయమని ప్రోత్సహించారట. ప్రోత్సహించడం ఉచితం కాబట్టి చాలామంది చేసి ఉండొచ్చు అక్కడ మాట ఇచ్చినవాడే ఓటు వేస్తాడని హామీ లేదు. ఓటమి తర్వాత ఓంప్రకాశ్ వెల్లడించిన వివరాల ప్రకారం, తనకు వచ్చిన 33 ఓట్లలో 11 ఓట్లు కుటుంబ సభ్యులవే. మిగిలినవి సన్నిహితులు, తనతో కలిసి చదువుకున్నవారు వేశారని తెలిపారు.అంటే 21 లక్షల మంది ఫాలోవర్లున్న వ్యక్తికి ఎన్నికల సమయంలో కుటుంబ సభ్యులు, స్నేహితుల మద్దతే ప్రధానంగా కనిపించింది. ఈ లెక్క చూసి సోషల్ మీడియా కంపెనీలు బాధపడాల్సిన అవసరం లేదు. అవి తమ పని సరిగ్గానే చేశాయి. ఫాలోవర్లను చూపించాయి, వ్యూస్‌ను లెక్కించాయి, లైక్‌లను భద్రపరిచాయి. ఓట్లను మాత్రం హామీ ఇవ్వలేదు. ఓంప్రకాశ్ ఓటమితో వెనక్కి తగ్గబోనని, గ్రామ ప్రజల కోసం పనిచేస్తూనే ఉంటానని చెప్పారు. అది స్వాగతించదగిన నిర్ణయమే. ఎన్నికల్లో గెలవకపోయినా ప్రజాసేవ చేయవచ్చు. గ్రామస్థుల నమ్మకాన్ని సంపాదించవచ్చు. తాను చెప్పిన లక్ష్యాలను ఆచరణలో చూపించవచ్చు. భవిష్యత్తులో ప్రజలు ఆయన పనిని చూసి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుంది.కానీ ఈ ఎన్నిక ఒక చిన్న హెచ్చరికను మాత్రం ఇచ్చింది. ప్రజాస్వామ్యంలో ఒక చిన్న కుర్చీ సంపాదించాలన్నా ప్రజల విశ్వాసం కావాలి. ఫాలోవర్లు మీ పోస్టును పైకి తీసుకెళ్తారు. ఓటర్లు మాత్రమే మిమ్మల్ని పదవిలోకి తీసుకెళ్తారు. ఆ రెండింటి మధ్య తేడా తెలియకపోతే, లక్షల మందిని వెనకేసుకొచ్చిన నాయకుడికి కూడా చివరికి తన కుటుంబ సభ్యుల ఓట్లనే లెక్కపెట్టుకోవాల్సి వస్తుంది.

యాసంగిలో తెలంగాణ రైతులకు కొత్త కష్టాలు..



నిజామాబాద్, ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణ యాసంగి సాగులో వరికి ప్రత్యామ్నాయ పంటలను వేయాలని ప్రభుత్వం హెచ్చరిస్తోంది. పప్పుధాన్యాలు, కూరగాయలు, నూనెగింజల సాగును ప్రోత్సహించేందుకు సబ్సిడీ విత్తనాలు అందుబాటులోకి తీసుకురావాలని సర్కార్ యోచిస్తోంది. అయితే గ్రామాల్లో కోతుల బెడద రైతులకు కొత్త తలనొప్పిగా మారింది. వరికి ప్రత్యామ్నాయంగా వేసే పంటలను కోతులు దెబ్బతీస్తాయనే భయం రైతుల్లో ఉంది. కోతులను తరిమేందుకు చేసిన ప్రయత్నాలు ఫలితాలు ఇవ్వలేదని రైతులు వాపోతున్నారు.తెలంగాణలో రానున్న యాసంగి సీజన్ సాగుపై రైతుల్లో ఇప్పటినుంచే తీవ్ర ఆందోళన మొదలైంది. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గే అవకాశం ఉందని.. జలాశయాల్లో నీటి లభ్యతపై అనిశ్చితి నెలకొందని రాష్ట్ర ప్రభుత్వం.. వరి సాగుకు దూరంగా ఉండాలని అన్నదాతలకు ఇప్పటికే సూచిస్తోంది. తక్కువ నీటితో పండే పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయలు, ఇతర ఆరుతడి పంటల వైపు రైతులు మొగ్గు చూపాలని తెలంగాణ వ్యవసాయ శాఖ ఇప్పటికే పలు అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది. అయితే.. ఈ ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులకు కొత్త సమస్యలు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా కోతుల బెడద రైతులను ప్రత్యామ్నాయ పంటలు వేయకుండా మరో అడ్డంకిగా మారుతోంది. పంటలు మార్చాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం చెబుతున్నా.. వేసిన పంటను కోతుల నుంచి ఎలా కాపాడుకోవాలన్నది రైతులకు ప్రశ్నగా మారింది.వచ్చే యాసంగి సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 70 లక్షల నుంచి 75 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. గత యాసంగిలో సుమారు 92 లక్షల ఎకరాల్లో సాగు జరిగింది. అప్పటితో పోలిస్తే ఈసారి సాగు విస్తీర్ణం భారీగా తగ్గే అవకాశాలు ఉన్నట్లు చెబుతోంది. మరోవైపు జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గడం, భూగర్భ జలాల పరిస్థితిపై ఆందోళనల నేపథ్యంలో ఈ సీజన్‌లో సాగు విస్తీర్ణం 50 లక్షల ఎకరాల కంటే తక్కువకు పడిపోవచ్చని కొందరు నిపుణులు భావిస్తున్నారు. వాస్తవంగా ఎంత భూమిలో సాగు జరుగుతుందన్నది నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులు, రైతులు ఎంచుకునే పంటలపై ఆధారపడి ఉంటుంది.పంటల మార్పిడిని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ విత్తనాల పంపిణీతోపాటు రైతులకు అనేక అవగాహన కల్పించాలని కీలక నిర్ణయం తీసుకుంది. జాతీయ వంటనూనెల మిషన్ కింద వేరుశనగ, పొద్దుతిరుగుడు, నువ్వులు, కుసుమ వంటి నూనెగింజల సాగును రాష్ట్రంలోని 51,225 ఎకరాల్లో ప్రోత్సహించాలని రేవంత్ రెడ్డి సర్కార్ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం 28,680 క్వింటాళ్ల విత్తనాలను సిద్ధం చేసింది. ఈ కార్యక్రమం కింద కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు రూ.49 కోట్లు కేటాయించినట్లు తెలుస్తోంది. పంట, విత్తన రకం, పథకం నిబంధనలను బట్టి రైతులకు 50 శాతం నుంచి 75 శాతం వరకు సబ్సిడీ లభించే అవకాశం ఉంది.వరి సాగుకు బదులుగా రైతులు ఇతర పంటలు వేసుకోవాలని ప్రభుత్వం, వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో మాత్రం అన్నదాతలకు మరో కీలక సమస్య ఎదురవుతోంది. అడవుల నుంచి గ్రామాల్లోకి, పంట పొలాల్లోకి వస్తున్న కోతులు.. కూరగాయలు, పప్పుధాన్యాలు, ఇతర పంటలను దెబ్బతీస్తున్నాయని రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఇళ్లలోకి చొరబడి వస్తువులను చిందరవందర చేయడం.. ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లడం వంటి ఘటనలతో ఇప్పటికే ప్రజలు కోతులు అంటే తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఇక గ్రామాల్లో మనుషులపై కోతులు దాడి చేసిన సంఘటనలు కూడా ఈ ఆందోళనకు కారణాలుగా ఉన్నాయి.టమోటా, వంకాయ, బెండకాయ, చిక్కుడు, సొరకాయ, పొట్లకాయ, దోసకాయ, కాకరకాయ, బీరకాయ వంటి కూరగాయలతోపాటు గుమ్మడికాయ, బంగాళాదుంప, బీట్‌రూట్, క్యారెట్ పంటలకు కోతుల వల్ల నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు. జొన్న, మొక్కజొన్న, సజ్జలు, వేరుశనగ, పొద్దుతిరుగుడు, చెరకు, కందులు, మినుములు, పెసర్లు, శనగలు, పుచ్చకాయ వంటి పంటలను కూడా కోతుల నుంచి కాపాడుకోవాల్సిన పరిస్థితి ఉందని పేర్కొంటున్నారు. పంటను ఎన్ని రోజులు కాపాడుకున్నా.. ఒక్కసారి కోతుల గుంపు పొలంపై దాడి చేస్తే.. పంట మొత్తం చేతికి అందకుండా పోతుందని వాపోతున్నారు.గతంలో ఈ కోతుల గుంపులను తరిమికొట్టేందుకు ఆయా ప్రాంతాల్లో ఎన్ని ప్రయత్నాలు చేసిన విఫలం అయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో కోతులను పట్టి అడవుల్లోకి తరలించేందుకు ప్రత్యేక సిబ్బందిని ఉపయోగించినా.. ఈ చర్యలు ఆశించిన స్థాయిలో సమస్య పరిష్కారం కాలేదని స్థానికులు చెబుతున్నారు. రైతులు కొండముచ్చులను ఉపయోగించడం, వాటి బొమ్మలు, అలాంటి వేషధారణలతో కోతులను భయపెట్టే ప్రయత్నాలు చేయడం వంటి చర్యలు చేపట్టినా అవి కొంతవరకే పనిచేస్తున్నాయని అంటున్నారు. గుంపులుగా వచ్చే కోతులను ప్రతిరోజూ పొలాల్లో కాపలా కాసి తరిమేయడం కష్టమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వరికి ప్రత్యామ్నాయ పంటల సాగులో పెట్టుబడి పెట్టిన తర్వాత కోతుల వల్ల దిగుబడి తగ్గితే ఆర్థికంగా భారీగా నష్టపోతామనే భయం అన్నదాతలను పట్టి పీడిస్తోంది. మరీ ముఖ్యంగా కూరగాయలు, పప్పుధాన్యాలు, నూనెగింజల సాగును ప్రోత్సహించే ముందు ఆయా ప్రాంతాల్లో కోతుల బెడదను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం కనిపిస్తోంది. పంటల ఎంపికపై సూచనలు ఇవ్వడంతోపాటు, పంటలను రక్షించుకునేందుకు అనువైన మార్గాలు, స్థానిక పరిస్థితులకు తగిన పరిష్కారాలపై వ్యవసాయ, అటవీ శాఖలు సమన్వయంతో పనిచేయాలని రైతులు కోరుతున్నారు.నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని పంటల మార్పిడిని ప్రోత్సహించడం ఒకవైపు అవసరం అవుతుండగా.. మరోవైపు వన్యప్రాణుల సంచారం వల్ల పంటలకు కలిగే నష్టాన్ని తగ్గించడం కూడా కీలకంగా మారింది. రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించడంతోపాటు, కోతుల బెడద ఎక్కువగా ఉన్న గ్రామాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటేనే యాసంగి సాగుపై నెలకొన్న అనిశ్చితిని కొంతవరకు తగ్గించే అవకాశం ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు.

జెండా ఎగరేస్తే జైలుకా?



న్యూఢిల్లీ.జాతీయ జెండా ఎగరేస్తే జైలుకు పంపే దేశంలో ఇప్పుడు మనమున్నామా? ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి నిరసన తెలిపిన కార్యకర్తలు జనతా పార్టీకి చెందిన అశుతోష్ రంకా, సౌరవ్ దాస్ నిర్బంధం ఈ ప్రశ్నను మరోసారి ముందుకు తెచ్చింది. అయితే వారిని కేవలం జాతీయ జెండా ఎగురవేసినందుకే నిర్బంధించారని చెప్పడం సరైనది కాదు. అనుమతి లేని ప్రవేశం, గతంలో ఇచ్చిన శాంతిభద్రతల హామీల ఉల్లంఘన, మళ్లీ అవాంఛనీయ పరిస్థితులు ఏర్పడే అవకాశాల వంటి ఆరోపణలను అధికారులు ప్రస్తావించారు. అక్టోబర్ 14న వారిని ఐదు రోజుల నిర్బంధానికి పంపగా, అక్టోబర్ 19న మరో రెండు రోజులు పొడిగించారు. అక్టోబర్ 21న, జంతర్ మంతర్‌కు తిరిగి అధికారిక నిరసన స్థల హోదా లభించే వరకు అక్కడ నిరసనలకు పిలుపునివ్వబోమని లిఖితపూర్వక హామీ ఇచ్చిన అనంతరం విడుదల చేసినట్లు వార్తా కథనాలు పేర్కొన్నాయి. ఈ పరిణామాలను ఇద్దరు కార్యకర్తల అరెస్టు, విడుదలగా మాత్రమే చూడలేం. నిరసన హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛ, ప్రభుత్వ నియంత్రణ, జాతీయ జెండా గౌరవం మధ్య ఉన్న సంబంధాన్ని పరిశీలించాల్సిన సందర్భమిది.జంతర్ మంతర్: ప్రజల గొంతుక దశాబ్దాలుగా రైతులు, కార్మికులు, విద్యార్థులు, మహిళలు, వివిధ ప్రజా ఉద్యమాలకు జంతర్ మంతర్ వేదికగా నిలిచింది. పార్లమెంటుకు సమీపంలో ప్రజలు తమ సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లే ముఖ్యమైన ప్రదేశమది. నిరసనలకు ఎలాంటి ఆంక్షలూ ఉండకూడదని చెప్పలేం. స్థానిక ప్రజల హక్కులు, శాంతిభద్రతలు, ట్రాఫిక్ వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని కొన్ని నియంత్రణలు విధించవచ్చు. కానీ నిరసనలకు సరైన, న్యాయబద్ధమైన ప్రత్యామ్నాయ స్థలాలను చూపించాలి. ఏదో తూ తూ మంత్రంగా చూపించామని చెబితే సరిపోదు. అక్కడ నిరసన తెలిపే ప్రజల గొంతు మీడియాకు, పాలకులకు చేరే అవకాశం ఉందా అన్నదే ముఖ్యం. 2018లో మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్ కేసులో సుప్రీంకోర్టు శాంతియుత నిరసన హక్కును గుర్తిస్తూనే, ఇతరుల హక్కులు, ప్రజల శాంతిని కాపాడేందుకు తగిన నియంత్రణలు అవసరమని స్పష్టం చేసింది.

జెండా ఎగరేయడం నేరమా?

రాజ్యాంగంలోని 19(1)(ఎ) అధికరణం భావప్రకటనా స్వేచ్ఛను, 19(1) (బి) అధికరణం శాంతియుతంగా, నిరాయుధంగా సమావేశమయ్యే హక్కును కల్పిస్తున్నాయి. ఈ హక్కులు సహేతుకమైన రాజ్యాంగ పరిమితులకు లోబడి ఉంటాయి. 2004లో భారత ప్రభుత్వం వర్సెస్ నవీన్ జిందాల్ కేసులో సుప్రీం కోర్టు గౌరవప్రదంగా జాతీయ జెండాను ఎగురవేయడం భావప్రకటనా స్వేచ్ఛలో భాగమని గుర్తించింది. అదే సమయంలో, జాతీయ గౌరవ అవమాన నిరోధక చట్టం -1971లోని సెక్షన్ 2 జాతీయ పతాకాన్ని నిర్దిష్ట విధాలుగా అవమానించే చర్యలను శిక్షార్హంగా పరిగణిస్తుంది. అయితే ప్రభుత్వ విధానాలను విమర్శించడం, జెండాను అవమానించడం రెండూ ఒకటి కావు. అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం, ఈ ఇద్దరిపై జాతీయ గౌరవ చట్టం కింద ప్రత్యేక అభియోగం నమోదైనట్లు నిర్ధారణ కాలేదు. అందువల్ల వారిని జెండా అవమానించినందుకు నిర్బంధించారని చెప్పడం తగదు.అయితే, ఈ కేసులో అధికారుల వాదనలను విస్మరించలేం. చట్టబద్ధమైన ఆదేశాలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకునే అధికారం పోలీసులకు ఉంది. కానీ తీసుకున్న చర్య అవసరమైనదా? ఐదు రోజుల నిర్బంధం తప్పనిసరైందా? తక్కువ కఠినమైన ప్రత్యామ్నాయాలు అందుబాటులో ఉన్నాయా? అనే ప్రశ్నలకు కూడా సమాధానాలు అవసరం. ఈ చర్య రాజకీయ కక్ష సాధింపేనని నిర్ధారించడానికి ఆధారాలు కావాలి. అదే సమయంలో చర్యల సముచితతను ప్రశ్నించడం ప్రజాస్వామిక హక్కు. చట్టం అందరికీ సమానంగా వర్తించాలి; రాజకీయ అభిప్రాయాల ఆధారంగా దాని అమలులో తేడాలు ఉండకూడదు.భారత స్వాతంత్ర్య పోరాటంలో త్రివర్ణ పతాకం వలస పాలనపై అసమ్మతికి, స్వయం పాలన ఆకాంక్షకు ప్రతీకగా నిలిచింది. ఆ చరిత్రను గుర్తు చేసుకోవడం అంటే నేటి పాలనను బ్రిటిష్ పాలనతో సమానంగా చూడడం కాదు. స్వతంత్ర భారతదేశంలో రాజ్యాంగం కల్పించిన హక్కుల విలువను గుర్తించడం. దేశభక్తి అంటే ప్రభుత్వ నిర్ణయాలన్నింటినీ అంగీకరించడం కాదు. దేశాన్ని ప్రేమిస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నించవచ్చు. జాతీయ జెండాను గౌరవిస్తూ పాలకుల విధానాలను విమర్శించవచ్చు. చట్టాన్ని గౌరవిస్తూనే దాని అమలులోని లోపాలను ప్రశ్నించవచ్చు. జెండా ప్రజలది. రాజ్యాంగం ప్రజలది. దేశం కూడా ప్రజలదే. నిరసనలకు చట్టబద్ధమైన పరిమితులు ఉండవచ్చు. కానీ ఆ పరిమితులు ప్రజల గొంతును మూయడానికి సాధనాలుగా మారకూడదు. జాతీయ జెండా గౌరవాన్ని కాపాడటంతోపాటు, అది ప్రతిబింబించే స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, పౌర గౌరవాన్ని పరిరక్షించడం కూడా ప్రభుత్వ బాధ్యతే. అదే త్రివర్ణ పతాకం మనకు అందించే అసలు సిసలైన సందేశం!

పశ్చిమమధ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న అర్నబ్ తుపాన్

కృష్ణా జిల్లా కేంద్రం మచిలీపట్నంలో తుఫాను ప్రభావం తీవ్రంగా కనిపించింది. ఎన్నడూ లేనివిధంగా భారీ వృక్షాలు నేలకొరగడంతో నగరంలోని పలు ప్రాంతాల్లో రహదారులకు అంతరాయం ఏర్పడింది.

భారీ వర్షాలు, ఈదురుగాలుల ప్రభావం తో రోడ్లపైకి నీరు చేరి పలు ప్రాంతాలు జలమయంగా మారాయి. చెట్లు విరిగిప డటం, జంతువులు మృత్యువాత పడటంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. నగరంలోని ఎస్పీ కార్యాలయం పరిసరాలు, ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్, కలెక్టర్ బంగ్లా సమీప ప్రాంతాలు, లక్ష్మీ టాకీస్ సెంటర్‌తో పాటు పలు ప్రధాన రహదారు లపై భారీ వృక్షాలు కూలిపడ్డాయి. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. కొన్ని చోట్ల రహదారులపై చెట్లు అడ్డంగా పడటంతో ప్రజలు ప్రయాణించేందుకు ఇబ్బందులు పడ్డారు.తుఫాను ప్రభావంతో ఒక్కసారిగా మారిన వాతావరణ పరిస్థితులు నగర ప్రజలను ఆందోళనకు గురిచేశాయి. భారీ వృక్షాలు నేలకొరగడం, రహదారులపై నీరు నిలిచిపోవడం నగరంలో పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నాయి.రోడ్లపై పడిపోయిన చెట్లను తొలగించి రాకపోకలను పునరుద్ధరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదకరంగా ఉన్న చెట్లు, విద్యుత్ తీగలు, నీరు నిలిచిన ప్రాంతాలకు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు.

విజయనగరం పోటీ ఆసక్తికరం

విజయనగరం ,విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఎన్నికలు రాజకీయంగా ఆసక్తికరంగా మారుతున్నాయి. ఈ పదవిని దక్కించుకోవాలని తెలుగుదేశం పార్టీ) గట్టి పట్టుదలతో ముందుకు సాగుతోంది. అభ్యర్థి ఎంపిక నుంచి ప్రచారం వరకు ప్రతి అంశాన్నీ పార్టీ నాయకత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్నట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా టీడీపీ ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ఈ ఎన్నికపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో పోటీ మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (కూడా తమ అభ్యర్థి గెలుపు కోసం ప్రయత్నిస్తోంది.మేయర్ అభ్యర్థిగా అవనాపు భార్గవి పేరును టీడీపీ ఎంపిక చేయడం స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. పోటీలో పలువురు ఆశావహులు ఉన్నప్పటికీ, భార్గవికి అవకాశం కల్పించారు. విజయనగరం మేయర్ పదవి జనరల్ మహిళకు కేటాయించడంతో బీసీ సామాజిక వర్గానికి చెందిన ఆమెకు పార్టీ అవకాశం ఇచ్చింది. చాలా కాలంగా టీడీపీకి అండగా ఉంటున్న అవనాపు కుటుంబానికి ప్రాధాన్యం ఇవ్వాలనే ఉద్దేశం కూడా ఈ ఎంపిక వెనుక ఉందని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.భార్గవికి ప్రత్యక్ష రాజకీయాల్లో అనుభవం లేకపోయినా, ఆమెకు రాజకీయ కుటుంబ నేపథ్యం ఉంది. టీడీపీ సీనియర్ నాయకుడు అవనాపు విజయ్ భార్యగా, దివంగత మాజీ మున్సిపల్ చైర్మన్ అవనాపు సూరిబాబు కోడలిగా ఆమె స్థానిక ప్రజలకు పరిచయం ఉన్న వ్యక్తి. ఈ ఎన్నికతోనే ఆమె రాజకీయ ప్రస్థానం ప్రారంభమవుతోంది. కూటమి పార్టీల మద్దతుతో ప్రజల్లోకి వెళ్తున్న ఆమె, మేయర్ పీఠాన్ని తమ పార్టీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు.వైఎస్సార్సీపీ తరఫున కోలగట్ల శ్రావణి (బరిలో ఉండటం పోటీకి మరో కోణాన్ని జోడిస్తోంది. మాజీ ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి కుమార్తె అయిన ఆమె, గతంలో డిప్యూటీ మేయర్‌గా పనిచేశారు. దీంతో నగర పాలనపై తనకు అనుభవం ఉందని వైఎస్సార్సీపీ వర్గాలు చెబుతున్నాయి. రాజకీయ అనుభవం లేని అభ్యర్థిని టీడీపీ ఎంపిక చేసిందంటూ ప్రత్యర్థి పార్టీ విమర్శలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే బీసీ ఓటర్ల ప్రభావం, కూటమి పార్టీల ఐక్యత తమకు అనుకూలిస్తాయని టీడీపీ నాయకులు భావిస్తున్నారు.ప్రచారంలో భాగంగా భార్గవి తనకు అవకాశం ఇస్తే నగర అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇస్తున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటం వల్ల నిధులు, అభివృద్ధి కార్యక్రమాల విషయంలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని ఆమె చెబుతున్నారు. గత వైఎస్సార్సీపీ పాలనలో నగర అభివృద్ధి ఆశించిన స్థాయిలో జరగలేదని విమర్శిస్తున్నారు. అయితే ఈ అంశాలపై రెండు పార్టీల మధ్య రాజకీయ వాదోపవాదాలు కొనసాగుతున్నాయి.మరోవైపు అదితి గజపతిరాజు ఎన్నికల ప్రచారంలో చురుగ్గా పాల్గొంటూ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం ప్రయత్నిస్తున్నారు. ఆమె తండ్రి, కేంద్ర మాజీ మంత్రి, గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు కుటుంబానికి విజయనగరంలో ఉన్న రాజకీయ నేపథ్యం కూడా ఈ పోటీకి ప్రాధాన్యం కల్పిస్తోంది. కోలగట్ల వీరభద్రస్వామి తన కుమార్తెకు మద్దతుగా నిలుస్తుండటంతో ఇరు వర్గాల మధ్య రాజకీయ పోటీ మరింత ఆసక్తికరంగా మారింది. చివరకు ప్రజాప్రతినిధుల మద్దతు, స్థానిక సమీకరణాలు, పార్టీల వ్యూహాలు మేయర్ ఎన్నిక ఫలితాన్ని ప్రభావితం చేయనున్నాయి.

ఆర్టీపీపీ విద్యుత్ ఉత్పత్తి సంక్షోభం

కడప, ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లాలో ఉన్న డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు (ఆర్టీపీపీ) ప్రస్తుతం తీవ్రమైన విద్యుత్ ఉత్పత్తి సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. బొగ్గు మరియు నీటి కొరత కారణంగా ఈ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి తీవ్రంగా ప్రభావితమైంది. ఈ ప్లాంట్‌లో మొత్తం ఆరు యూనిట్ల ద్వారా 1650 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరగాల్సి ఉంది, కానీ ప్రస్తుతం కేవలం 1050 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి మాత్రమే జరుగుతోంది. ఈ పరిస్థితి, ముఖ్యంగా బొగ్గు నిల్వలు కేవలం మూడు రోజులకు సరిపడే స్థాయిలో ఉన్నప్పుడు, విద్యుత్ ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోతుందనే భయాన్ని కలిగిస్తోంది. ప్లాంట్‌కు రోజుకు 21 వేల టన్నుల బొగ్గు అవసరం, కానీ ప్రస్తుతం అందుబాటులో ఉన్న బొగ్గు నిల్వలు తక్కువగా ఉండటం వల్ల విద్యుత్ ఉత్పత్తి నిలిపివేయబడే ప్రమాదం ఉంది. అంతేకాకుండా, ప్లాంట్‌కు రోజుకు 70 క్యూసెక్కుల నీరు అవసరం, కానీ వర్షాలు లేకపోవడం వల్ల నీటి కొరత కూడా తీవ్రంగా ఉంది. ఈ పరిస్థితి, గతంలో కూడా ఇలాంటి సమస్యలు ఎదుర్కొన్న ఆర్టీపీపీకి, ఇప్పుడు మరింత కష్టమైన దశలోకి తీసుకెళ్లింది.వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, 2014 నుండి 2019 మధ్య కాలంలో ఆర్టీపీపీకి బొగ్గు కొరత సమస్యలు ఎదురయ్యాయి. అయితే, ఆ సమయంలో జగన్ తీసుకున్న చర్యల వల్ల బొగ్గు నిల్వలు 3 లక్షల టన్నుల వరకు చేరాయి. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా, ఈ ప్లాంట్ మళ్లీ పాత సమస్యలతో బాధపడుతోంది. ఆర్టీపీపీ ప్రధాన ఇంజనీర్ వాసుదేవరావు మాట్లాడుతూ, ప్రస్తుతం ప్లాంట్‌లో కేవలం మూడు రోజులకు సరిపడే బొగ్గు నిల్వలు మాత్రమే ఉన్నాయని తెలిపారు. విద్యుత్ ఉత్పత్తి 1000 నుండి 1050 మెగావాట్ల మధ్య జరుగుతోంది, కానీ నీటి లభ్యత తక్కువగా ఉండటం వల్ల పరిస్థితి మరింత కష్టంగా మారుతోంది. ఏపీజెన్‌కో యాజమాన్యం ఆదేశాల మేరకు మాత్రమే ఉత్పత్తి కొనసాగుతోంది.ఈ పరిస్థితి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. విద్యుత్ ఉత్పత్తి నిలిపివేయబడితే, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారు. విద్యుత్ సరఫరా నిలిచిపోతే, వ్యాపారాలు, విద్యా సంస్థలు, మరియు ఇతర సేవలు ప్రభావితమవుతాయి. ప్రజలు ప్రభుత్వానికి ఈ సమస్యను పరిష్కరించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. విద్యుత్ ఉత్పత్తి పెరగడానికి అవసరమైన బొగ్గు మరియు నీటి నిల్వలను పెంచడం, అలాగే ప్లాంట్‌కు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం అత్యంత అవసరం. ఈ పరిస్థితి పరిష్కరించకపోతే, రాయలసీమలో విద్యుత్ ఉత్పత్తి మరింత కష్టంగా మారవచ్చు.

సబ్బితంలో బీఆర్ఎస్‌కు షాక్..

పెద్దపల్లి, పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామ

కోనసీమ జిల్లాను కుదిపేసిన 'అర్నబ్'..

అమలాపురం, అర్నబ్ తుపాను డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో తీవ్ర విధ్వంసం సృష్టించింది. గంటకు 100 కిలోమీటర్లకు పైబడిన వేగంతో వీచిన ప్రచండ గాలులకు జిల్లాలోని అనేక ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. ఈ గాలుల ధాటికి వేలాదిగా చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. తుపాను తీరం దాటే సమయంలో కోనసీమ, నర్సాపురం ప్రాంతాల్లో గంటకు 125 నుంచి 135 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచినట్లు అధికారులు అంచనా వేశారు. అమలాపురం, ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం, అంబాజీపేట, పి.గన్నవరం, రాజోలు, అయినవిల్లి, మామిడికుదురు సహా పలు మండలాల్లో తుఫాను ప్రభావం అత్యధికంగా కనిపించింది. రాజోలు, ఉప్పలగుప్తం, సఖినేటిపల్లి, మల్కిపురం మండలాల్లో భారీ వర్షపాతం నమోదైంది. ఈ విపత్తు కారణంగా వేలాది ఎకరాల్లో ఉద్యాన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ముఖ్యంగా కొబ్బరి, అరటి, బొప్పాయి చెట్లు భారీ సంఖ్యలో విరిగిపడటంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. తుపాను ధాటికి ఒక్క కోనసీమ జిల్లాలోనే దాదాపు 6,000 విద్యుత్ స్తంభాలు కూలిపోయినట్లు ప్రాథమిక నివేదికలు సూచిస్తున్నాయి. దీంతో జిల్లాలోని అనేక గ్రామాలు అంధకారంలో చిక్కుకున్నాయి. రాజోలు–అమలాపురం మార్గంలో భారీ వృక్షాలు కూలిపోవడంతో సుమారు రెండు కిలోమీటర్ల వరకు వాహనాల రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. ప్రస్తుతం అధికార యంత్రాంగం సహాయక చర్యలను ముమ్మరం చేసింది. విరిగిపడిన స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు సిబ్బంది శ్రమిస్తున్నారు. అదే సమయంలో రహదారులపై పేరుకుపోయిన చెట్లను, ఇతర అడ్డంకులను తొలగించి రవాణాను సాధారణ స్థితికి తీసుకువచ్చే పనులు వేగంగా కొనసాగుతున్నాయి.

ఒకే రోజు పరీక్షలా...

హైదరాబాద్, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో రోడ్లు మరియు భవనాల శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పరీక్షల తేదీలు, అలాగే స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహించే జూనియర్ ఇంజనీర్ పరీక్షల తేదీలు ఒకే రోజు రావడంతో అభ్యర్థుల నుంచి పెద్ద ఎత్తున విజ్ఞప్తులు అందాయి. నవంబర్ 6, 7 తేదీల్లో జరగాల్సిన టీజీపీఎస్సీ ఏఈ పరీక్ష తేదీలు, నవంబర్ 2 నుంచి 6 వరకు షెడ్యూల్ చేయబడిన ఎస్సెస్సీ జూనియర్ ఇంజనీర్ పరీక్ష తేదీలతో క్లాష్ అవుతున్నట్లు అభ్యర్థులు కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యను తీవ్రంగా పరిగణించిన టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం, ఎస్సెస్సీ చైర్మన్‌తో స్వయంగా మాట్లాడి అభ్యర్థుల ఇబ్బందిని పరిష్కరించేందుకు చొరవ చూపారు. ఈ పరీక్షల క్లాష్‌ను పరిష్కరించే క్రమంలో, ఎస్సెస్సీ జూనియర్ ఇంజనీర్ పరీక్ష తేదీ నవంబర్ 6, 2026గా కేటాయించబడి, టీజీపీఎస్సీ ఏఈ పరీక్ష కూడా అదే రోజు రావడం వల్ల నష్టపోతున్న అభ్యర్థుల కోసం ప్రత్యేక వెసులుబాటు కల్పించారు. నవంబర్ 6వ తేదీన ఎస్సెస్సీ జూనియర్ ఇంజనీర్ (సివిల్) పరీక్షను కలిగి ఉండి, టీజీపీఎస్సీ ఏఈ (సివిల్) పరీక్షకు కూడా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు కొన్ని నిర్దిష్ట పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. అభ్యర్థులు తమ ఎస్సెస్సీ జెఈ హాల్ టికెట్ కాపీ (నవంబర్ 6 తేది ఉన్నది), టీజీపీఎస్సీ ఏఈ నోటిఫికేషన్ అప్లికేషన్ కాపీ మరియు టీజీపీఎస్సీ వన్ టైమ్ రిజిస్ట్రేషన్ ఐడీలను సమర్పించాలని కమిషన్ స్పష్టం చేసింది.ఈ పత్రాలను అక్టోబర్ 30, 2026 సాయంత్రం 5 గంటలలోపు టీజీపీఎస్సీ ఆఫీస్‌లోని హెల్ప్ డెస్క్ ద్వారా లేదా ష్ణవశ్రీజూటవబఎఏబిణజూబఇ.ణనీల.తిని మెయిల్ ఐడీకి పంపాలని సూచించారు. అభ్యర్థులు ఏ ఒక్కరు కూడా మంచి అవకాశాన్ని కోల్పోకూడదనే ఉద్దేశంతో పరిశీలన తర్వాత సాధ్యమైనంత వరకు నవంబర్ 7, 2026న టీజీపీఎస్సీ ఏఈ పరీక్షను రాయడానికి తగిన ఏర్పాట్లు చేయనున్నట్లు కమిషన్ అధికారికంగా వెల్లడించింది. అభ్యర్థులు గడువులోగా తమ డాక్యుమెంట్లను సమర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చామంతి పూలతో లాభాల బాట...

నిజామాబాద్, మారుతున్న కాలానికి అనుగుణంగా, సంప్రదాయ పంటల సాగుతో నష్టాలను చవిచూస్తున్న రైతులు ప్రత్యామ్నాయ, లాభసాటి పంటల వైపు మళ్లుతున్నారు. ఈ కోవలోనే అనంతపురం జిల్లా నార్పల మండలం వెంకటాం గ్రామానికి చెందిన రైతు రఫీ చామంతి పూల సాగులో అనూహ్య విజయం సాధిస్తున్నారు. మార్కెట్ అవసరాలను, పండగల డిమాండ్‌ను అర్థం చేసుకుని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవచ్చని ఆయన నిరూపిస్తున్నారు. రైతు రఫీ తనకున్న ఆరు ఎకరాల వ్యవసాయ క్షేత్రాన్ని రెండు ఎకరాల చొప్పున మూడు భాగాలుగా విభజించారు. ప్రతి విభాగంలో విడతల వారీగా వివిధ రకాల చామంతి పూలను నాటారు. సాధారణంగా చామంతి సాగును జూన్–జులై నెలల్లో ప్రారంభిస్తారు. దీనివల్ల శీతాకాలంలో, కార్తీక మాసం, పెళ్లిళ్ల సీజన్‌లో అధిక దిగుబడులు వస్తాయి. అయితే రఫీ దసరా, దీపావళి, సంక్రాంతి వంటి ప్రధాన పండగల సీజన్‌ను లక్ష్యంగా చేసుకుని ముందుగానే మొక్కలు నాటారు. దీనివల్ల పండగల సమయంలో పూలకు అధిక గిరాకీ, మంచి ధర లభిస్తున్నాయి.ప్రస్తుతం ఆయన పొలంలో బుల్లెట్ (తెలుపు, పసుపు రకాలు), ఐశ్వర్య, ముస్కిన్ వైట్, పేపర్ ఎల్లో, పేపర్ వైట్, పూర్ణిమా ఎల్లో, పూర్ణిమా వైట్ వంటి వివిధ రకాల చామంతులు సాగవుతున్నాయి. బెంగళూరు, హైదరాబాద్, తెలంగాణ ప్రాంతాల నుండి ఒక్కో మొక్కను రూ. 1.50 చొప్పున కొనుగోలు చేసి, రవాణా, నాటడానికి కలిపి రూ. 2 ఖర్చు అయ్యిందని రఫీ తెలిపారు. వేసవిలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా రాత్రి 12 గంటల నుంచి తెల్లవారుజామున 4 గంటల వరకు కూలీలను పెట్టి మొక్కలను నాటించారు. మొక్కకు మొక్కకు మధ్య ఒక అడుగు దూరం ఉండేలా జాగ్రత్త పడ్డారు. మొక్కలు నాటిన ఐదు నెలలకు దిగుబడి ప్రారంభమవుతుంది. సాగులో భాగంగా ఎరువులు, పురుగుమందుల వాడకంలో రఫీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. మొదట డీఏపీ, ఆ తర్వాత ట్రిపుల్ 8, ట్రిపుల్ 28 వంటి ఎరువులను ఉపయోగిస్తారు. డ్రిప్ ద్వారా 13-45-13, 12-0-61 వంటి వాటిని అందిస్తూ, మధ్యమధ్యలో న్యూట్రియెంట్స్, ఫార్ములా 6, హ్యూమిక్ పౌడర్ వంటి వాటిని కూడా వాడుతున్నారు. చామంతి పూలకు సాధారణంగా మొగ్గ వచ్చే వరకు తెగుళ్లు పెద్దగా రావు, కానీ మొగ్గ వచ్చిన తర్వాత పురుగులు, తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంటుందని, వాటి నివారణకు అవసరమైన మందులను వాడుతున్నామని రఫీ వివరించారు.చామంతి పూల కోత సుమారు రెండు నెలల పాటు నిరంతరం కొనసాగుతుంది, ఆ తర్వాత మూడో నెలలో దిగుబడి కాస్త తగ్గుతుంది. మొదటి కోతలోనే రెండు ఎకరాల నుంచి ఒక టన్ను పూలు వచ్చాయని, కిలో రూ. 200 చొప్పున రూ. 2 లక్షల ఆదాయం వచ్చిందని రఫీ తెలిపారు. మొత్తం పెట్టుబడి మొక్కలు నాటినప్పటి నుంచి రూ. 2.25 లక్షలు అయ్యిందని, మొదటి కోతతో పెట్టుబడి వెనక్కి వచ్చి, రెండో కోత నుంచి లాభాలు వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మార్కెటింగ్ విషయానికొస్తే, ఉదయం కోసిన పూలను అనంతపురం మార్కెట్‌కు, సాయంత్రం కోసిన పూలను బెంగళూరు, చెన్నై, మైసూరు వంటి పెద్ద నగరాలకు పంపిస్తారు. వ్యాపారులు స్వయంగా పొలానికి వచ్చి పూలను కొనుగోలు చేయడం వల్ల రవాణా ఖర్చులు తగ్గుతాయని తెలిపారు. నాణ్యత ఆధారంగా ధరలు మారుతాయని, మొదటి నాణ్యత పూలకు రూ. 275, రెండో నాణ్యతకు రూ. 150, మూడో నాణ్యతకు రూ. 100 వరకు ధర లభిస్తుందని వివరించారు. ఏ పంట అయినా సరే, నాణ్యత ఉంటేనే లాభాలు వస్తాయని, లేకపోతే పంట

పాదయాత్రకు అంతా సిద్ధం



కడప, గత కొన్నాళ్ళుగా పాదయాత్ర చేస్తాను అని చెప్తూ వస్తోన్న వైసీపీ అధినేత వైఎస్ జగన్ తాజాగా పాదయాత్రపై కీలక వ్యాఖ్యలు చేసారు. స్థానిక సంస్థల ఎన్నికల ఉత్కంఠ నడుస్తున్న వేళ, తన సొంత నియోజకవర్గమైన పులివెందుల వేదికగా ఆయన క్యాడర్‌లో సరికొత్త జోష్ నింపే ప్రయత్నం చేసారు. ఈ సందర్భంగా రాబోయే సెప్టెంబర్ నెల నుంచి తాను రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర ప్రారంభించబోతున్నట్లు ప్రకటించారు. ప్రస్తుత ప్రభుత్వం రెండేళ్లలోనే తుడిచిపెట్టుకుపోతుందని జగన్ ధీమా వ్యక్తం చేయడం గమనార్హం.వైసీపీ కార్యకర్తలకు జరుగుతున్న పరిణామాలపై స్పందిస్తూ ప్రతి ఒక్కరికీ తోడుగా ఉంటానని జగన్ హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఒక వర్గం సమయం నడుస్తోందని, భవిష్యత్తులో తమ సమయం తప్పక వస్తుందని వ్యాఖ్యానించారు. అన్యాయం చేసిన ఎవరినీ వదిలిపెట్టబోమని, అన్నింటికీ వడ్డీతో సహా చెల్లిస్తామని పోలీసులకు జగన్ వార్నింగ్ ఇచ్చారు. తనపై రాజకీయంగా అన్యాయం చేయాలనుకుంటే ఎంతమంది వచ్చినా ఎదుర్కోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ తనకు అండగా నిలిచే పులివెందుల ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.ఈ తాజా ప్రకటనపై రాజకీయ వర్గాల్లో భిన్నమైన విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఒకవైపు వైఎస్ జగన్ పాదయాత్ర ప్రకటన ద్వారా పార్టీ శ్రేణుల్లో స్థానిక ఎన్నికల వేళ భరోసా నింపే ప్రయత్నం చేస్తున్నారని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక సెప్టెంబర్ రెండు నుంచి జగన్ పాదయాత్ర మొదలుపెట్టే అవకాశం ఉందని భావిస్తున్నారు. మరోవైపు, అధికారంలో ఉన్న కూటమి నేతలు ఈ వ్యాఖ్యలను తప్పుబడుతున్నారు. ఓటమి నైరాశ్యంతోనే జగన్ పోలీసులపై, ప్రభుత్వంపై ఇలాంటి బెదిరింపు ధోరణి వ్యాఖ్యలు చేస్తున్నారని అధికార పక్ష నేతలు విమర్శిస్తున్నారు.

జగన్ సొంతూరులో షాక్

వైఎస్ జగన్ సొంత నియోజకవర్గమైన పులివెందులలో వైఎస్సార్‌సీపీకి ఊహించని షాక్ తగిలింది. నియోజకవర్గ పరిధిలో ఎంపీటీసీలు కూటమి ఖాతాలోకి చేరాయి. పులివెందుల నియోజకవర్గంలోని 65 ఎంపీటీసీ స్థానాలకు 64 ఏకగ్రీవం అయ్యాయి. అలాగే 7 జెడ్పీటీసీ స్థానాలకుగాను 3 ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు. పులివెందుల మున్సిపాలిటీలో కూడా మొత్తం 40 వార్డులకుగానూ 20 వార్డులు కూటమి ఖాతాలోకి చేరాయి..వైఎస్ జగన్ ప్రాతినిధ్యం వహిస్తున్న కడప జిల్లా పులివెందుల నియోజకవర్గంలో కూటమి ఘన విజయం సాధించింది. పులివెందుల నియోజకవర్గంలోని 65 ఎంపీటీసీ స్థానాలకుగాను 64 ఏకగ్రీవమయ్యాయి. అలాగే నియోజకవర్గ పరిధిలో ఉన్న 7 జెడ్పీటీసీ స్థానాలకు 3 ఏకగ్రీవం అయ్యాయి. ఈ మేరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఏకగ్రీవాలను ప్రకటించారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడంతో ఒకే నామినేషన్ దాఖలైన చోట ఏకగ్రీవాలను ప్రకటించారు. ఆయా జిల్లాల ఎన్నికల అధికారులు ప్రకటిస్తున్నారు. పులివెందుల నియోజకవర్గం వేంపల్లి మండలంలో 18 ఎంపీటీసీలకు 17 ఏకగ్రీవం అయ్యాయి.. వీటిలో టీడీపీకి 15, జనసేన పార్టీ, బీజేపీలకు చెరొకటి చొప్పున ఏకగ్రీవం అయ్యాయి. కేవలం అల్లిరెడ్డిపల్లె ఎంపీటీసీ స్థానానికి మాత్రమే పోలింగ్ జరగనుంది.పులివెందుల మండలంలోని ఐదు ఎంపీటీసీ స్థానాలు, వేముల మండలంలోని 8 ఎంపీటీసీ స్థానాలు, చక్రాయపేట మండలంలోని 9 ఎంపీటీసీ స్థానాలు, తొండూరు మండలంలోని 8 ఎంపీటీసీ స్థానాల్లోనూ టీడీపీ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సింహాద్రిపురం మండలంలోని 8 ఎంపీటీసీ స్థానాల్లో టీడీపీ అభ్యర్థులు ఏకగ్రీవమయ్యారు. వైఎస్ కుటుంబం సొంత ఊరైన సింహాద్రిపురం మండలంలోని బలపనూరు ఎంపీటీసీ స్థానం టీడీపీకి ఏకగ్రీవమైంది. పులివెందుల నియోజకవర్గం పరిధిలోని 7 జెడ్పీటీసీలలో కూటమికి మూడుస్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. వీటిలో సింహాద్రిపురంలో వైఎస్సార్‌సీపీ అసలు నామినేషనే వేయలేదు. తొండూరు, చక్రాయపేటల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసినా ఉపసంహరించుకున్నారు.. దీంతో ఈ మూడు ఏకగ్రీవం అయ్యాయి. కూటమికి ఏకగ్రీవమైన 64 ఎంపీటీసీల్లో చాలావరకు వైఎస్సార్‌సీపీ అసలు నామినేషన్లు దాఖలు చేయలేదు.. నామినేషన్లు వేసిన చోట్ల ఉపసంహరించుకున్నారు. అంతేకాదు కమలాపురం నియోజకవర్గంలో 6 జెడ్పీటీసీ స్థానాలు కూటమి ఖాతాలోకి చేరాయి. చెన్నూరు, సీకే దిన్నె, వల్లూరు, వీరపనాయనిపల్లె, పెండ్లిమర్రి జెడ్పీటీసీలు టీడీపీకి.. కమలాపురం జనసేనకు ఏకగ్రీవమయ్యాయి.ఇటు జమ్మలమడుగు నియోజకవర్గంలోని మూడు జెడ్పీటీసీలు (ముద్దనూరు, జమ్మలమడుగు, ఎర్రగుంట్ల) బీజేపీకి ఏకగ్రీవం అయ్యాయి. కొండాపురం జెడ్పీటీసీ టీడీపీకి ఏకగ్రీవం అయ్యింది. ఇటు బద్వేలు నియోజకవర్గంలో 7 జెడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి.. వాటిలో పోరుమామిళ్ల, బద్వేలు, అట్లూరు టీడీపీకి ఏకగ్రీవం అయ్యాయి. ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని ప్రొద్దుటూరు, మైదుకూరు నియోజకవర్గంలోని చాపాడు, రాజంపేట నియోజకవర్గంలోని వీరబల్లి, సిద్ధవటం టీడీపీ అభ్యర్థులకు ఏకగ్రీవం అయ్యాయి. మొత్తం మీద కడప జిల్లాలో కూటమికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు ఏకగ్రీవాలు అయ్యాయి. ఇటు వైఎస్ జగన్ సొంత నియోజకవర్గం పులివెందుల మున్సిపల్ ఎన్నికల్లో 40 వార్డులకుగానూ కూటమికి 20 వార్డుల్ని ఏకగ్రీవం అయ్యాయి. ఇప్పుడు ఎంపీటీసీ, జెడ్పీటీసీలు కూడా కూటమికి ఏకగ్రీవం అయ్యాయి.

పారులే ప్రథమం ఫలితాలే ప్రధానం



న్యూఢిల్లీ,ఎన్నికైన ప్రభుత్వాలకు కేంద్రంలో, రాష్ట్రంలో సారథ్యం వహిస్తూ నరేంద్ర మోడీ ప్రజా జీవితంలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. ఈ కాలంలో తొలుత గుజరాత్‌లో, ఆ తర్వాత దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాల విస్తరణకు ఆయన నాయకత్వం వహించారు. వాటి పరిమాణంతోపాటు నాణ్యత కూడా గణనీయంగా పెరిగింది. ముఖ్యమంత్రిగా మోడీ హయాంలో గుజరాత్‌లో రహదారులు, విద్యుత్తు, ఓడరేవులు, రవాణా అనుసంధాన వ్యవస్థల్లో వచ్చిన మార్పులు ఆ రాష్ట్ర అభివృద్ధి ప్రస్థానంలో కీలక భాగంగా నిలిచాయి. జాతీయ స్థాయిలో మౌలిక సదుపాయాల రంగంలో వచ్చిన మార్పులు అత్యంత గణనీయమైనవి. 2014లో దేశంలో 74 విమానాశ్రయాలు ఉండగా, ఆ సంఖ్య ఇప్పుడు 165కు పెరిగింది. వాటిలో కొన్ని ప్రపంచంలోనే అత్యుత్తమ విమానాశ్రయాల సరసన నిలుస్తున్నాయి. దర్భంగా, గయ వంటి చిన్న నగరాల నుంచి ఢిల్లీ, ముంబై, కోల్‌తతా, బెంగళూరు తదితర నగరాలకు నేడు రోజూ పలుమార్లు విమాన సర్వీసులు నడుస్తున్నాయి.నా కెరీర్ తొలినాళ్లలో నేను పనిచేసిన ప్రాంతాల్లో ఈ నగరాలు కూడా ఉన్నాయి. రైల్వే వ్యవస్థలోనూ భారీ విస్తరణ, ఆధునికీకరణ చోటుచేసుకున్నాయి. ప్రత్యేక సరుకు రవాణా కారిడార్లు, రైల్వేలైన్ల విద్యుదీకరణ నుంచి వందేభారత్ రైళ్లు అందిస్తున్న ఉన్నత స్థాయి ప్రయాణ అనుభవం, పునరాభివృద్ధి చేసిన రైల్వేస్టేషన్ల వరకు అనేక మార్పులు వచ్చాయి. జాతీయ రహదారులు గణనీయంగా విస్తరించాయి. కొత్త ఎక్స్‌ప్రెస్ వేలు, ఓడరేవులు, మెట్రో రైలు వ్యవస్థలు దేశంలో రవాణా అనుసంధాన స్వరూపాన్నే మార్చేశాయి. నేడు దేశంలోని వివిధ ప్రాంతాల్లో ప్రయాణించే భారతీయులకు, గతంలో విదేశాలకు వెళ్లినప్పుడు మాత్రమే లభించే రహదారి ప్రయాణ అనుభవం స్వదేశంలోనూ అందుబాటులోకి వచ్చింది. భారత్ లాజిస్టిక్స్ పనితీరు ర్యాంకు గణనీయంగా మెరుగుపడింది. 2014లో 54వ స్థానంలో ఉన్న భారత్ 2023 నాటికి 16 స్థానాలు ఎగబాకి 38వ స్థానానికి చేరుకుంది. అదే సమయంలో స్థూల దేశీయోత్పత్తి (జిడిపి)లో లాజిస్టిక్స్ వ్యయం 7.97 శాతానికి తగ్గింది.ఇది ఆర్థిక పోటీతత్వానికి ఊతమిచ్చింది. కంటికి కనిపించే ఈ మార్పులు సహజంగానే విస్తృత దృష్టిని ఆకర్షించాయి. అయితే, మోడీ పాలనలో వచ్చిన మరింత ప్రాథమికమైన మార్పు ఏమిటంటే, మౌలిక సదుపాయాలను ఎలా భావించాలి, ఎలా ప్రణాళికలు రూపొందించాలి, ఎలా అమలు చేయాలి అన్న విషయంలో పూర్తిగా కొత్త దృక్పథం ఏర్పడటం. నా అనుభవంలో, మౌలిక సదుపాయాల నిర్వహణలో ఎదురయ్యే సమస్యలకు చాలా అరుదుగా ఒక్క తప్పుడు నిర్ణయమే కారణమవుతుంది. విడివిడిగా చూస్తే సమంజసంగా అనిపించే అనేక నిర్ణయాలు ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేకపోవడమే అసలు సమస్య. ఫలితంగా, అన్ని భాగాల ప్రయోజనాలను కలిపినా సమగ్ర వ్యవస్థ అందించాల్సిన ప్రయోజనం అందదు. ఈ వాస్తవాన్నిమోడీ దాదాపు సహజ సిద్ధమైన అవగాహనతో గుర్తించారు. ఒక నిర్దిష్ట సదుపాయాన్ని నిర్మించే శాఖ కోణం నుంచే మౌలిక సదుపాయాలను చూడకుండా, ఆ నిర్మాణం ద్వారా సాధించాల్సిన విస్తృత ఫలితంపై ఆయన దృష్టి సారించారు.ఫలితాలకు ప్రాధాన్యమిస్తూ, పౌరులను కేంద్రంగా చేసుకునే ఈ దృక్పథం ఆయన పరిపాలనా విధానంలో ప్రధాన లక్షణంగా నిలిచింది. మోడీ విధానంలో సాంకేతిక పరిజ్ఞాన వినియోగం మరో ముఖ్యమైన అంశం. గుజరాత్‌లో బిసాగ్ (బిఐఎస్ ఎజి) సంస్థ ఉపగ్రహ అనువర్తనాలు, భౌగోళిక సమాచార వ్యవస్థలు, ప్రాదేశిక ప్రణాళికల రూపకల్పనలో సామర్థ్యాన్ని పెంపొందించింది. భౌగోళిక సమాచారంతో రాష్ట్ర భౌగోళిక స్వరూపాన్ని దృష్టిలో ఉంచుకుని అభివృద్ధిని సమగ్రంగా పరిశీలించడం సాధ్యమైంది. భూమి, రహదారులు, జలవనరులు, నివాస ప్రాంతాలు, పరిశ్రమలు, ఇతర మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమాచారాన్ని ఒకచోట చేర్చడం ద్వారా అభివృద్ధిలోని వివిధ అంశాల మధ్య సంబంధాలను మరింత సమగ్రంగా అర్థం చేసుకునే అవకాశం లభించింది. ఈ నేపథ్యమే జాతీయ స్థాయిలో గతి శక్తి కార్యక్రమాన్ని ప్రారంభించడానికి మార్గం సుగమం చేసింది. గుజరాత్‌లో అప్పటికే ఉన్న విధానాన్ని యథాతథంగా దేశవ్యాప్తంగా అమలు చేయడమే పిఎం గతిశక్తి ప్రాధాన్యం కాదు.భౌగోళిక పరిస్థితులు, మౌలిక సదుపాయాలు, ఆర్థిక కార్యకలాపాలను పరస్పరం అనుసంధానమైన అంశాలుగా పరిగణించే పరిపాలనా దృక్పథాన్ని మరింత విస్తృత స్థాయిలో దేశమంతటా అమలు చేయడమే దీని ప్రత్యేకత. వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖలు, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు సమగ్ర ప్రణాళికలు రూపొందించడంతోపాటు సమన్వయంతో అమలు చేసేలా గతిశక్తి దోహదపడింది. తద్వారా ప్రభుత్వం మొత్తం ఒకే సమగ్ర వ్యవస్థగా పనిచేసే విధానానికి బాటలు పడ్డాయి. గతిశక్తి ప్రారంభానికి ముందు ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం ఉండేది కాదా? అనే ప్రశ్న సహజంగానే తలెత్తవచ్చు. కచ్చితంగా ఉండేది. అయితే, ప్రభుత్వాలు సంప్రదాయంగా అనుసరించిన సమన్వయ విధానానికి, గతిశక్తి వ్యవస్థాగతంగా అమలు చేయాలనుకుంటున్న విధానానికి మధ్య ప్రాథమికమైన తేడా ఉంది.గతిశక్తి, ప్రగతి కార్యక్రమాలు కలిపి మోడీ పరిపాలనా విధానంలోని ఒక ప్రత్యేక లక్షణాన్ని స్పష్టం చేస్తున్నాయి.ఒకవైపు మొత్తం వ్యవస్థను సమగ్రంగా చూడటం, మరోవైపు ఒక్కో ప్రాజెక్టు పనులను నిలిపివేయగల నిర్దిష్ట అడ్డంకులపై దృష్టి పెట్టడం ఈ విధానంలో కనిపిస్తుంది. వివిధ భాగాలు పరస్పరం ఎలా అనుసంధానమై ఉన్నాయో అర్థం చేసుకోకుండా మౌలిక సదుపాయాల ప్రణాళికలను సమర్థంగా రూపొందించలేం. అలాగే, అమలులోని ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పరిష్కరించకుండా ప్రాజెక్టులను సమర్థంగా పూర్తి చేయలేం. సమగ్ర ప్రణాళికలు, నిరంతర పర్యవేక్షణ, సమస్యల పరిష్కారంపై నిలకడైన దృష్టి.. ఈ మూడింటి సమ్మేళనం వల్ల గతంలో ఎన్నడూ లేనంత విస్తృత స్థాయిలో, మరింత సమర్థంగా మౌలిక సదుపాయాల అభివృద్ధి సాధ్యమైంది. పౌరులకు ఎలాంటి అంతరాయాలు లేని సౌకర్యవంతమైన అనుభవాన్ని అందించడం, విస్తృత ఆర్థిక వ్యవస్థ ఉత్పాదకతను పెంచడం అనే లక్ష్యాలతో, మొత్తం వ్యవస్థను సమగ్రంగా పరిగణించే విధానాన్ని రాష్ట్ర పాలనలో తీసుకురావడం ఇందులోని అసలు ప్రాధాన్యం.

కృష్ణా జిల్లా వ్యాప్తంగా ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం

అమరావతి:కృష్ణా జిల్లా వ్యాప్తంగా ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులతో పలుచోట్ల చెట్లు, హోర్డింగులు విరిగిపడ్డాయి. అవనిగడ్డ నియోజకవర్గం, కోడూరు మండలంలోని వేణుగోపాలపురం లో రోడ్డు మీద భారీ చెట్లు విరిగిపడ్డాయి. రాత్రి నుండి ఎడతెరిపి లేకుండా కురిసిన వానకి రోడ్లన్నీ జలమయం అయ్యాయి. భయంకరమైన గాలులకు దగ్గరలోనే ఉన్న సముద్రం అల్లకల్లోలంగా మారడంతో ప్రజలందరు భయభ్రాంతులకు గురయ్యారు. రాత్రినుండి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పూర్తిగా అంధకారంలో వేణుగోపాలపురం ఉండిపోయింది. విద్యుత్ సరఫరా నిలవడనీతో ఒక ప్రక్క ఆక్వారంగం తీవ్ర ఇబ్బందులకు గురవుతుంది.. మరోప్రక్క ఇంటర్నెట్ సేవలు కూడా నిలవడనీతో 1977 తుపాన్ మాదిరి ఏమైనా వస్తుందా అని ప్రాణ భయంతో రాత్రి నుండి గ్రామ ప్రజలు భయపడ్డారు. గ్రామం నుండి బయటకు వెళ్ళాలి అంటే ఉల్లిపాలెం వైపు లింగన్నకోడు దగ్గర వంతెన విరిగిపోవటం, సాలెంపాలెం వైపు రోడ్డు లేకపోవటం వలన వేణుగోపాలపురం

గ్రీన్ ఎనర్జీ కారిడార్-3 ప్రాజెక్టుకు మోదీ పచ్చ జెండా

ఒంగోలు, ఏపీకి కేంద్రం భారీ చేయూత అందింది. రాష్ట్రంలో విద్యుత్ ప్రసార వ్యవస్థను ఆధునికీకరించే దిశగా రూ.27,370 కోట్ల వ్యయంతో చేపట్టే 'గ్రీన్ ఎనర్జీ కారిడార్-3 ప్రాజెక్టుకు మోదీ సర్కార్ పచ్చ జెండా ఊపింది. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 7,872 సర్క్యూట్ కిలోమీటర్ల మేర కొత్త కరెంట్ లైన్లను వేసేందుకు, అలాగే రామాయపట్నం, కొప్పాక ప్రాంతాల్లో కొత్తగా 400 కేవీ సబ్‌స్టేషన్లను ఏర్పాటుకు కూడా కేంద్రం ఆమోదం తెలిపింది.అనుకున్న విధంగా ఈ గ్రీన్ కారిడార్ ప్రాజెక్ట్ పట్టాలు ఎక్కితే... చాలా రకాల ప్రయోజనాలు ఉంటాయి.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం భారీ సాయం అందించింది. ముఖ్యంగా పునరుత్పాదక ఇంధన రంగానికి కేంద్రం భారీ ఊతం ఇచ్చింది. రాష్ట్రంలో విద్యుత్ ప్రసార వ్యవస్థను ఆధునికీకరించే దిశగా ఏకంగా రూ.27,370 కోట్ల వ్యయంతో చేపట్టే 'గ్రీన్ ఎనర్జీ కారిడార్-3 ప్రాజెక్టుకు మోదీ సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సోలార్, పవన విద్యుత్‌తో పాటు పంప్డ్ స్టోరేజ్ ద్వారా ఉత్పత్తి అయ్యే కరెంట్‌ను నేరుగా మెయిన్ గ్రిడ్‌కు అనుసంధానం చేయడం ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం.ఈ భారీ ప్రాజెక్టులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 7,872 సర్క్యూట్ కిలోమీటర్ల మేర కొత్త కరెంట్ లైన్లను వేసేందుకు, అదే విధంగా రామాయపట్నం, కొప్పాక ప్రాంతాల్లో కొత్తగా 400 కేవీ సబ్‌స్టేషన్లను ఏర్పాటుకు కూడా కేంద్రం ఆమోదం తెలిపింది. వీటి ద్వారా మొత్తం 9,500 ఓఎం అదనపు విద్యుత్ ప్రసార సామర్థ్యం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా తీరప్రాంతాల్లోని పోర్టులు, పారిశ్రామిక వాడలకు నిరంతర, నాణ్యమైన కరెంట్‌ను అందించాలన్న లక్ష్యంతో రామాయపట్నం సబ్‌స్టేషన్ కీలకంగా మారనుంది. ఈ గ్రీన్ ఎనర్జీ కారిడార్ పనులన్నింటినీ 2029-30 ఆర్థిక సంవత్సరం నాటికి పూర్తి చేసేందుకు ప్రభుత్వం ప్లాన్ చేసింది.అనుకున్న విధంగా ఈ గ్రీన్ కారిడార్ ప్రాజెక్ట్ పట్టాలు ఎక్కితే... చాలా రకాల ప్రయోజనాలు ఉంటాయి. ఇందులో ఏర

విశాఖ మేయర్ ఎవరిది...



విశాఖపట్టణం,ఆంధ్రప్రదేశ్‌లో సాగరతీర నగరమైన విశాఖపట్నం రాజకీయంగా మరోసారి చర్చనీయాంశంగా మారింది. మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ ఎన్నికల నేపథ్యంలో నగరంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు, నిత్యావసరాల ధరలు, స్థానిక సమస్యలు ప్రధాన అంశాలుగా కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖను పెట్టుబడులకు కీలక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తోంది. గూగుల్ డేటా సెంటర్, ఆర్సెలర్ మిత్తల్ ఉక్కు పరిశ్రమ వంటి భారీ ప్రాజెక్టులు, విమానాశ్రయ సదుపాయాల అభివృద్ధి, రైల్వే జోన్ వంటి అంశాలు నగర భవిష్యత్తుపై చర్చకు దారితీస్తున్నాయి. అయితే ఈ పరిణామాలు ఓటర్ల రోజువారీ జీవితంపై ఎంతవరకు ప్రభావం చూపుతాయన్నది కీలకంగా మారింది.మేయర్ పదవిని బీసీ మహిళలకు కేటాయించిన నేపథ్యంలో రాజకీయ పోటీకి ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. కూటమి తరఫున గతంలో కార్పొరేటర్‌గా పనిచేసిన ముక్కా శ్రావణి, వైసీపీ తరఫున ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి పేర్లు ప్రధానంగా చర్చకు వస్తున్నాయి. యువ నాయకత్వానికి అవకాశం ఇవ్వాలనే అభిప్రాయంతో పాటు, ప్రజా సమస్యలపై గళం వినిపించిన అనుభవం కూడా ఓటర్ల చర్చల్లో ప్రస్తావనకు వస్తోంది. మరోవైపు జీవీఎంసీ పరిధిలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు కూటమికి చెందినవారిగా ఉండటం రాజకీయ సమీకరణాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. వైసీపీ అభ్యర్థులకు స్థానిక నేతల మద్దతు, ప్రచార నిర్వహణ, ఆర్థిక వనరులు ఎంతవరకు అందుబాటులో ఉంటాయన్న అంశాలపైనా చర్చ సాగుతోంది.విశాఖలో పెట్టుబడులు, ఐటీ పరిశ్రమల విస్తరణ యువతలో ఉద్యోగావకాశాలపై ఆశలు పెంచుతున్నాయి. గూగుల్ డేటా సెంటర్ వంటి ప్రాజెక్టులతో భవిష్యత్తులో మరిన్ని సంస్థలు నగరానికి వస్తాయని ఇంజినీరింగ్ విద్యార్థులు ఆశిస్తున్నారు. ఇతర నగరాలకు వెళ్లకుండా విశాఖలోనే ఉద్యోగాలు పొందే అవకాశం ఏర్పడుతుందని భావిస్తున్నారు. అయితే అభివృద్ధి ప్రాజెక్టులతో పాటు ప్రజలకు తక్షణ ప్రయోజనం కలిగించే మౌలిక సదుపాయాలపైనా దృష్టి పెట్టాలని నగరవాసులు కోరుతున్నారు. మెట్రో రైలు ప్రాజెక్టును వేగవంతం చేయడం, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం, రోడ్ల విస్తరణ, రద్దీ కూడళ్లలో వంతెనల నిర్మాణం వంటి అంశాలు స్థానిక అవసరాలుగా ముందుకొస్తున్నాయి.సంక్షేమ పథకాలపై ప్రజల స్పందన కూడా ఎన్నికల చర్చలో భాగమవుతోంది. తల్లికి వందనం ద్వారా ఇద్దరు పిల్లలకు ఆర్థిక సాయం అందుతోందని ఓ మహిళ పేర్కొనగా, ఉచిత బస్సు ప్రయాణం వల్ల రోజువారీ రవాణా ఖర్చులు తగ్గాయని మరో మహిళ అభిప్రాయపడ్డారు. పింఛను, వంటగ్యాస్ సిలిండర్ల వంటి ప్రయోజనాలు కుటుంబాలకు ఉపశమనం కలిగిస్తున్నాయని కొందరు చెబుతున్నారు. అదే సమయంలో బియ్యం, పప్పులు, నూనెల ధరలు పెరగడం సామాన్యులపై భారంగా మారిందని ఆటో డ్రైవర్లు వంటి వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. తమకు ఇళ్ల స్థలాలు కల్పించాలని కూడా కోరుతున్నారు. అంటే సంక్షేమ పథకాలపై సంతృప్తితో పాటు ధరల నియంత్రణ, జీవన వ్యయంపై అసంతృప్తి కూడా ప్రజాభిప్రాయంలో కనిపిస్తోంది.ఇక కూటమిలోని కొన్ని వార్డుల్లో రెబల్ అభ్యర్థులు బరిలో కొనసాగడం పోటీని మరింత ఆసక్తికరంగా మార్చే అంశంగా నిలుస్తోంది. తొలుత పలు వార్డుల్లో నామినేషన్లు దాఖలు కాగా, చర్చల అనంతరం కొందరు ఉపసంహరించుకున్నప్పటికీ మరికొందరు పోటీలో కొనసాగినట్లు సమాచారం. వీరి ప్రభావం స్థానికంగా ఎలా ఉంటుందనేది ఎన్నికల ప్రక్రియలో గమనించాల్సిన అంశం. మొత్తంగా విశాఖ రాజకీయాల్లో భారీ పెట్టుబడులు, ఉద్యోగాల ఆశలు ఒకవైపు.. నిత్యావసరాల ధరలు, రవాణా, తాగునీరు, రోడ్లు వంటి సమస్యలు మరోవైపు నిలుస్తున్నాయి. నగర భవిష్యత్తు కోసం దీర్ఘకాలిక అభివృద్ధిని కోరుకుంటూనే, తమ రోజువారీ ఇబ్బందులకు పరిష్కారం చూపే పాలనను ప్రజలు ఆశిస్తున్నారు. ఈ రెండు అంశాల మధ్య ఓటర్ల ప్రాధాన్యాలు ఎలా మారతాయన్నదే జీవీఎంసీ ఎన్నికల చర్చలో కీలకంగా నిలుస్తోంది.

మంత్రుల పక్కచూపులు...



నల్గొండ, తెలంగాణ కాంగ్రెస్ లో అప్పుడే 2028 అసెంబ్లీ ఎన్నికల హడావిడి కనిపిస్తోంది. ముఖ్యంగా పలువురు మంత్రులు రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, ఇప్పటి నుంచే వ్యూహాలు రచిస్తున్నారు. కొందరు మంత్రులు తమ సొంత నియోజకవర్గాలను కాదని, ఇతర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇది కాంగ్రెస్ పార్టీతో పాటు ఇతర రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. నియోజకవర్గాల పునర్విభజన, రిజర్వేషన్ల మార్పులపై వస్తున్న ఊహాగానాలే ఈ ముందస్తు వ్యూహాలకు ప్రధాన కారణంగా తెలుస్తోంది.ఖమ్మం, కరీంనగర్, మహబూబ్ నగర్, నల్గొండ తదితర ఉమ్మడి జిల్లాలకు చెందిన మంత్రులు నియోజకవర్గాలవారీగా రహస్య సర్వేలు చేయించుకుంటున్నట్టు సమాచారం. తాము ప్రాతినిధ్యం వహిస్తున్న స్థానాల్లో మారుతున్న రాజకీయ సమీకరణాలను బేరీజు వేసుకోవడంతో పాటు, భవిష్యత్తులో రిజర్వేషన్లు మారితే పోటీ చేయడానికి అనుకూలమైన ప్రత్యామ్నాయ స్థానాలను గుర్తించే పనిలో ఈ సర్వేలు ఉన్నాయి.ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇద్దరు మంత్రులు ఇప్పటికే సర్వే సంస్థల ద్వారా క్షేత్రస్థాయి అభిప్రాయాలను సేకరిస్తున్నారు. ముఖ్యంగా వైరా నియోజకవర్గంపై కన్నేసిన ఒక కీలక మంత్రి, అక్కడ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తూ స్థానిక నాయకులతో మమేకమవుతున్నారు. మరో మంత్రి కొత్తగూడెం నియోజకవర్గంపై దృష్టి పెట్టడంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ శిబిరాల్లో కలవరం రేపుతోంది. ఈ పరిణామాలు అధికార కూటమిలోని మిత్రపక్షమైన సీపీఐ శ్రేణుల్లోనూ ఆందోళనకు దారితీశాయి.ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన ఒక సీనియర్ మంత్రి తన సొంత నియోజకవర్గంపై పట్టుసడలకుండానే, ముందు జాగ్రత్తగా జిల్లావ్యాప్తంగా ఒక సర్వేను చేయించినట్లు తెలుస్తోంది. భవిష్యత్తులో ఎదురయ్యే రాజకీయ సవాళ్లను ముందే అంచనా వేయడంలో భాగంగా ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఇక ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోనూ మంత్రులు, కీలక నాయకులు ప్రత్యామ్నాయ నియోజకవర్గాలపై కన్నేయడం చర్చనీయాంశంగా మారింది. నియోజకవర్గాల సరిహద్దులు మారుతాయనే అంచనాలతో కొందరు నేతలు ఇప్పటి నుంచే తమ అనుచరుల ద్వారా గ్రౌండ్ రియాలిటీపై ఆరా తీస్తున్నారు.కేవలం అసెంబ్లీ స్థానాల మార్పు కోసమే కాకుండా, కొందరు మంత్రులు జాతీయ రాజకీయాల వైపు అడుగులు వేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఒక మంత్రి పార్లమెంట్ ఎన్నికల బరిలోకి దిగే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం. నియోజకవర్గాల పునర్విభజన జరిగితే కేంద్ర రాజకీయాల్లో తన ప్రభావాన్ని మరింత పెంచుకోవాలని ఆయన వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. ఎన్నికలకు ఇంకా సమయం ఉండగానే మంత్రులు ఈ విధంగా ప్రత్యామ్నాయ స్థానాల కోసం సర్వేలు నిర్వహించడం, రాజకీయ వర్గాల్లో అనేక అనుమానాలకు తావిస్తోంది. సొంత నియోజకవర్గాలపై నమ్మకం సడలిపోతోందా? లేక రాబోయే కాలంలో పార్టీలో లేదా ప్రభుత్వంలో జరగబోయే సమీకరణాల మార్పులను వారు ముందే పసిగట్టారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఏది ఏమైనప్పటికీ, 2028 ఎన్నికల సమరం కాంగ్రెస్ పార్టీలో ముందే మొదలైంది. అధికార పీఠాన్ని కాపాడుకోవడానికి నాయకులు వేస్తున్న ఈ ముందస్తు అడుగులు రాబోయే రోజుల్లో పెను మార్పులకు నాంది పలికే అవకాశం ఉంది.

ఆఖరుకు అరబ్ పార్టీల చేతుల్లోకి 'ఇజ్రాయెల్' అధికారం..



టెల్ అవీవ్ : ఇజ్రాయెల్ రాజకీయం మళ్లీ మొదటికొచ్చింది. పార్లమెంట్‌లో మొత్తం ఉన్న 120 సీట్లకు గాను.. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి కావలసిన 61 సీట్ల మ్యాజిక్ ఫిగర్ ఏ కూటమికీ దక్కక 'హంగ్' ముసుగు తన్నుకుంది. నెతన్యాహు కూటమికి 53, ఐసెన్‌కోట్ కూటమికి 48 వచ్చి తుమ్మితే ఊడిపోయే పరిస్థితి ఏర్పడితే చివరికి ఎవరూ పెద్దగా పట్టించుకోని అరబ్ పార్టీలు ఏకంగా 19 సీట్ల ఆధిక్యంతో 'కింగ్ మేకర్' సీట్లో కూర్చున్నాయి. "మేము లేకపోతే మీ కుర్చీ కదిలేలా లేదుగా" అంటూ వారు చిరునవ్వులు చిందిస్తుంటే ప్రధాన కూటములకు మాత్రం నోట్లో వెలక్కాయ పడినట్లయింది.ఇన్నాళ్లూ రాజకీయం అంతా మాదే అని విర్రవీగిన ప్రధాన నేతలకు ఇప్పుడు అరబ్ పార్టీల కాళ్లు పట్టుకోవాలో.. లేక ముక్కు మూసుకుని సహించాలో తెలియక పిచ్చి పడుతోంది. పైకి మాత్రం "ఛఛ.. వాళ్లతో మాకేంటి పొత్తు?" అని బింకాలు పోతున్నా లోలోపల మాత్రం "ఏదో ఒక రకంగా ఆ 61 సంఖ్య దాటితే బాగుణ్ణు" అని దేవుళ్లకు మొక్కుకుంటున్నారు. ఇక కుర్చీ కాపాడుకోవడానికి లేదా కొత్తగా ఎక్కడానికి అరబ్ పార్టీలు పెట్టే షరతులకు తల ఊపక తప్పని పరిస్థితి రాబోతోంది. నిన్నటిదాకా పక్కన పెట్టిన పార్టీలే ఇప్పుడు ఇజ్రాయెల్ రాజకీయాల్ని శాసించే రేంజ్‌కు చేరడం నిజంగానే కాలమహిమ..మరోవైపు దేశ అధ్యక్షుడు మాత్రం "బాబులూ.. దండం పెడతా.. మళ్లీ ఎన్నికలంటూ పెట్టి ప్రజల సొమ్ము తగలేయకండి. ఎవరి కాళ్లు పట్టుకుంటారో ఎవరితో కలుస్తారో మీ ఇష్టం కానీ ఏదో ఒక సర్కారును బండి లాగించండి" అని దండం పెట్టేస్తున్నారు. ఫలితాలు చూస్తుంటే ఇజ్రాయెల్ నేతలకు సొంతంగా సర్కార్ నడిపే యోగం ఉన్నట్లు లేదు.. అందుకే అధ్యక్షుడు కూడా తగ్గిపోమంటున్నారు.

తుది ఫలితాలు వచ్చాక ఏ మహానుభావుడు ఎవరితో జతకడతాడో.. ఈ 'హంగ్' నాటకానికి ఎలా తెరపడుతుందో చూడాలి. లీడ్‌ల లెక్కలే ఈ రేంజ్‌లో ఉంటే అసలు కథ ముందుంది. ప్రస్తుతానికైతే కింగ్ మేకర్లుగా మారిన అరబ్ పార్టీల దయ.. అధ్యక్షుడి ఆవేదన మధ్య ఇజ్రాయెల్ రాజకీయం ఒక థ్రిల్లర్‌ను తలపిస్తోంది.ఇజ్రాయెల్‌లో ప్రభుత్వ ఏర్పాటుకు సంబంధించి తదుపరి చర్చలు, కూటముల మధ్య రాజకీయ సంప్రదింపులు కీలకంగా మారనున్నాయి. అరబ్ పార్టీలు ఎవరికి మద్దతు ఇస్తాయి? అవి ఏవైనా షరతులు విధిస్తాయా? లేక ప్రధాన కూటములు ఇతర పార్టీలతో కలిసి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తాయా? అనే ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి.ప్రస్తుతం అందుబాటులో ఉన్న గణాంకాలు లీడ్‌లకు సంబంధించినవే కావడంతో తుది ఎన్నికల ఫలితాల ఆధారంగానే ప్రభుత్వ ఏర్పాటుపై స్పష్టత వస్తుంది. అప్పటివరకు ఇజ్రాయెల్ రాజకీయాల్లో కింగ్ మేకర్‌గా మారిన అరబ్ పార్టీల నిర్ణయం.. ప్రధాన కూటముల వ్యూహాలు, అధ్యక్షుడి సూచనలపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ కొనసాగనుంది.

అర్నాబ్ యూ టర్న్... బాంబు లాంటి తుఫాన్ !



అమరావతి,ఆర్నాబ్ తుఫాన్ నిజానికి గత పదేళ్ళలో సంభవించిన భారీ తుఫాన్లలో ఒకటి అని చెబుతున్నారు. ఈ రోజుకీ అది అలాగే జల ఖడ్గం గా మారి ఏపీలో విలయం సృష్టించింది. అయితే ఆర్నాబ్ తుఫాన్ మీద ముందు వేసుకున్న అంచనాలు అన్నీ తారు మారు అయ్యాయి. ఈ తుఫాన్ సముద్రంలోనే ఒకానొక దశలో యూటర్న్ తీసుకుంది అని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. దాని వల్ల తుఫాన్ వేగం తగ్గిందని ఆయన వివరించారు. అది కనుక జరిగి ఉండకపోతే ఆర్నాబ్ వేగం వేరే లెవెల్ లో ఉండేది, ఇక అది ఏపీపై మరింత పవర్ ఫుల్ గా విరుచుకుపడేది అని చెప్పుకొచ్చారు. ఇదంతా డెస్టిని అని బాబు అన్నారు. తుఫాన్ రాకను దాని గమనాన్ని ఎవరూ ఊహించలేరని బాబు మీడియాకు చెప్పుకొచ్చారు.

పది గంటలుగా అక్కడే :

తుఫాన్ అంటేనే వేగం, దూకుడు అయితే ఆర్నాబ్ తుఫాన్ మాత్రం చాలా తమాషాలే చేసింది. అది సముద్రంలో తీవ్ర స్థాయిలో ఏర్పడి ఏపీ వైపు కదిలినా దాని గమనంలో ఏర్పడిన కొన్ని అవాంతరాల వల్ల అది ఒక దశలో యూటర్న్ తీసుకోవాల్సి వచ్చింది. సముద్రంలో ఏర్పడుతున్న మరో వ్యవస్థ ఎదురుగా రావడంతో అర్నాబ్ తుపాను యూ టర్న్ తీసుకుందని చంద్రబాబు మీడియాకు విడమరచి చెప్పారు. అలా మంగళవారం రాత్రి 11:15 కి తీరాన్ని తాకిన తుపాను బుధవారం తెల్లవారుజామున మూడు నుంచి నాలుగు గంటలకు పూర్తిగా తీరాన్ని దాటుతుందని అంచనా వేస్తే అది కాస్తా పూర్తిగా 10 గంటల పాటు అక్కడే నిలిచిపోయిందని బాబు చెప్పారు. ఇలా తుఫాను నిలిచిపోవడం వల్ల తీవ్రతలో కూడా నెమ్మదించడం కనిపించింది అని ఆయన అన్నారు. లేకపోతే మరింత పెను ముప్పు వాటిల్లేది అని చెప్పుకొచ్చారు.

గరిష్టంగా 150 :

అప్పటికీ ఆర్నాబ్ తుఫాన్ గంటకు 125 నుంచి 135 కిలో మీటర్ల వేగంతో దూసుకుని వచ్చిందని ఇక తుపాను తీరం దాటిన తర్వాత కూడా గరిష్టంగా 150 కిలోమీటర్ల వేగం కనిపించిందని బాబు అన్నారు. భారీ తుఫానులు అన్నీ కూడా 150 కి మించి కిలోమీటర్ల వేగంతో సాగినవే. ఇపుడు ఆర్నాబ్ కొంత నెమ్మదించినా 150 స్పీడ్ ని అయితే క్రాస్ చేసింది అంటే సముద్రంలో వ్యవస్థ కనుక అడ్డుకోకపోయి ఉంటే దాని తీవ్రత కానీ స్పీడ్ కానీ ఏ 180 పై దాటేది అన్న అంచనాలూ ఉన్నాయి. మొదట్లో ఈ తుఫాన్ గురించి వచ్చిన తొలి అంచనాలు ఇదే చెబుతూ వచ్చాయి. అయితే దేవుడి దయ వల్లనే ఇలా జరిగింది అని అనుకోవాలి మరి

అలెర్ట్ గానే ఉండాలి :

ఇక తుఫాన్ తీరం దాటింది అని చాలా మంది ఇక అంతా మామూలే అని అనుకుంటారు. కానీ అది నిజం కాదు తుఫాన్ మళ్ళీ తీవ్ర వాయుగుండంగా ఆ మీదట వాయుగుండంగా అక్కడ నుంచి అల్పపీడనంగా ఇలా దశలు ఎన్నో జరిగి అపుడు అది బలహీన పడుతుంది. ఈ మొత్తం ప్రక్రియలు జరగాలీ అంటే కచ్చితంగా ఒక రోజు పైగా పడుతుంది. అందుకే తుఫాన్ తీరం తాకిన తరువాత కూడా భారీ వర్షాలు కురుస్తూనే ఉంటాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా తుఫాన్ అయిపోయింది అనుకోవద్దని ప్రజలకు సూచించారు. కొన్ని జిల్లాలలో ఇంకా భారీ వర్షాలు పడుతున్నాయని అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు ఆయన కోరారు.

స్థానిక సంస్థల ఎన్నికల పటిష్ఠ భద్రత

తిరుపతి: స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లాలో పటిష్ఠ భద్రత ఏర్పాటు చేసినట్లు ఎస్పీ సుబ్బారాయుడు తెలిపారు.పోలీస్,రెవెన్యూ శాఖల సమన్వయంతో పనిచేయాలని, ఓటర్లకు భరోసా కల్పించేందుకు ఫ్లాగ్ మార్చ్ లు నిర్వహిసున్నట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద వంద నుండి రుణాల మీటర్ల పరిధిలో నియంత్ర చర్యలు చేపడతామన్నారు. మున్సిపాలిటీ ఎన్నికల జరిగే ఐదు ప్రాంతాల్లో ఏపీఎస్పీ బలగా లను మోహరిస్తామన్నారు.

టాటా గ్రూప్ వివాదాలకూ మోదీకి లింక్ పెట్టేసిన రాహుల్!



భారత పారిశ్రామిక రంగానికే తలమానికమైన, దేశ ప్రతిష్టగా నిలిచే టాటా గ్రూప్ అంతర్గత అధికార పోరుకు రాజకీయం అంటించేశారు రాహుల్ గాంధీ. టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా ఎన్. చంద్రశేఖరన్ పునర్నియామకం, టాటా సన్స్ లిస్టింగ్ అంశంపై.. హోల్డింగ్ కంపెనీ యాజమాన్యానికి, నోయెల్ టాటా నేతృత్వంలోని టాటా ట్రస్ట్‌కు మధ్య బోర్డ్‌రూమ్ వివాదం ముదిరింది. ఈ అంశంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ... టాటా గ్రూప్‌ను నేరపూరితంగా నాశనం చేస్తున్నారు అంటూ ట్వీట్ చేశారు. ఒక్క కార్పొరేట్ దిగ్గజం కూడా నోరు మెదపడానికి సాహసించడం లేదు. మీరు ఇంకెంత కాలం మౌనంగా ఉంటారు? వాళ్లు మిమ్మల్ని పూర్తిగా కైవసం చేసుకునే దాకా వేచి చూస్తారా? భారతీయ వ్యాపారాలు మోదీ, అమిత్ షాల బొమ్మల ఆట కాదు. వ్యాపారవేత్తలకు ధైర్యం లేకపోవచ్చు కానీ మాకుంది. ఈ నేరాలపై మేము కచ్చితంగా న్యాయం జరిగేలా చూస్తాం అంటూ పెద్ద పెద్ద డైలాగులు చెప్పారు.

టాటాలది అంతర్గత సమస్య

ఈ ట్వీట్ తక్షణమే అధికార బీజేపీ వర్గాలతో పాటు కార్పొరేట్ రంగంలోనూ పెను వివాదానికి ఆజ్యం పోసింది. టాటా గ్రూప్ వ్యవహారాలు ఎప్పుడూ ట్రస్టీలు, చట్టబద్ధమైన బోర్డు నిబంధనల ప్రకారం నడుస్తుంటాయని, ఇది పూర్తిగా ఒక ప్రైవేట్ కార్పొరేట్ సంస్థ అంతర్గత పరిపాలనా వివాదమని పాలక వర్గాలు స్పష్టం చేశాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సైతం రాహుల్ ఆరోపణలపై మండిపడ్డారు. ప్రతిచోటా దెయ్యాలు, భూతాలను చూడటం మానుకోవాలని గట్టి కౌంటర్ ఇచ్చారు. రాజకీయ లబ్ధి కోసం దేశంలోని అత్యంత ప్రతిష్టాత్మక వ్యాపార సంస్థల అంతర్గత ప్రక్రియల్లోకి ప్రభుత్వాన్ని, ప్రధానిని లాగడం రాహుల్ గాంధీకి అలవాటుగా మారిందని, వాస్తవాలతో సంబంధం లేని ఆరోపణలు చేయడం సరికాదని బీజేపీ నేతలు మండిపడ్డారు.

ప్రతీ సమస్యకూ మోదీని ముడిపెట్టే రాహుల్ ప్లాన్

టాటాల విషయంలో మోదీపై రాహుల్ ఆరోపణలు షూట్ అండ్ స్కూట్ వ్యూహమే. గతంలో రాఫెల్ ఒప్పందం, పెగాసస్ లేదా సెబీ అంశాలపై ఆధారాలు లేకుండా ఆరోపణలు గుప్పించి, ఆ తర్వాత న్యాయపరంగా , పార్లమెంటరీ వేదికలపై వాటిని నిరూపించలేక వెనక్కి తగ్గిన ఉదంతాలు అనేకం ఉన్నాయి. ఇప్పుడు టాటా గ్రూప్‌లో చంద్రశేఖరన్ పదవీకాలం పొడిగింపు, టాటా ట్రస్ట్స్ అభ్యంతరాలు పూర్తిగా సంస్థాగతమైన లీగల్ అంశాలు. అటువంటి సాంకేతిక అంశాల్లోకి ప్రభుత్వం నేరపూరితంగా నాశనం చేస్తోంది అంటూ పెద్ద పెద్ద పదజాలంతో విరుచుకుపడటం, సరైన ఆధారాలు చూపించకపోవడం వల్ల ఇది కేవలం ఒక రోజు వార్తల్లో నిలిచేందుకు చేసిన సంచలన ప్రకటనగానే కనిపిస్తోంది.

ఆదాని, రిలయన్స్ చేతుల్లోకి వెళ్తుందని ప్రచారం చేసే ప్లాన్

వ్యాపార రంగంలో గుత్తాధిపత్యం పెరుగుతోందని, మోదీ సర్కారు కేవలం కొందరు ఎంపిక చేసిన కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తూ మిగిలిన సంస్థలను అణచివేస్తోందన్న క్రోనీ క్యాపిటలిజం ప్రచారాన్ని రాహుల్ గాంధీ మొదటి నుంచీ నిర్మిస్తూ వస్తున్నారు. భారతదేశపు పారిశ్రామిక ఆత్మగా గుర్తింపు పొందిన టాటా వంటి సంస్థపై కూడా ప్రభుత్వ పెత్తనం సాగుతోందని నమ్మించగలిగితే.. మధ్యతరగతి, స్వతంత్ర పారిశ్రామికవేత్తలు, విద్యావంతుల్లో ప్రభుత్వం పట్ల అపనమ్మకాన్ని కలిగించవచ్చన్నది కాంగ్రెస్ వ్యూహం. అందువల్లే టాటా వివాదంలో మోదీ, అమిత్ షాల పేర్లను నేరుగా ప్రస్తావిస్తూ, కార్పొరేట్ సమాజం కేంద్ర ప్రభుత్వ భయంతో మౌనంగా ఉందన్న భావనను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేశారని క్షీస్తున్నారు.

ఎయిర్ ఇండియా కొన్నప్పుడు టాటాలపైనే ఆరోపణలు చేసిన కాంగ్రెస్ బోర్డ్‌రూమ్ పోరాటాలకు, లీగల్ నిబంధనల వివరణలకు సంబంధించిన అంశాన్ని సరిగ్గా అర్థం చేసుకోకుండా లేదా ఉద్దేశపూర్వకంగానే రాజకీయ అస్త్రంగా మార్చేందుకు కాంగ్రెస్ ప్రయత్నించింది. ఆధారాలు అయితే లేవు. ప్రభుత్వం నిజంగా టాటాను ఎలా నాశనం చేస్తోందో, చట్టవిరుద్ధంగా ఎక్కడ జోక్యం చేసుకుందో నిరూపించలేనంత కాలం.. కాంగ్రెస్ ఆరోపణలు రాజకీయంగానే ఉంటాయి. నిజానికి టాటాలు ఎయిర్ ఇండియాను కొనుగోలు చేసినప్పుడు.. ఇదే కాంగ్రెస్ నేతలు ప్రభుత్వంతో కుమ్మక్కు ఆరోపణలు చేశారు.

కాంగ్రెస్ ప్లస్ కాక్రోచ్ ...నవంబర్ ఫస్ట్ హీట్!



న్యూఢిల్లీ,ఇప్పటిదాకా కాంగ్రెస్ పార్టీ ఆందోళనలు వేరు, కాక్రోచ్ పార్టీ ఉద్యమాలు వేరు. అయితే తొలిసారిగా రెండూ ఒక్కటిగా రాబోతున్నాయి. నవంబర్ ఒకటిన ఢిల్లీలో కాంగ్రెస్ నాయకత్వంలో ప్రతిపక్ష ఇండియా కూటమి చేపడుతున్న భారీ ఆందోళనకు కాక్రోచ్ జనతా పార్టీ తన పూర్తి మద్దతు ప్రకటించింది. రామ్ లీలా మైదానంలో నిర్వహించే ఈ ర్యాలికి తాము అండగా నిలిస్తామని సీజేపీ వ్యవస్థాపక అధ్యక్షుడు అభిజిత్ దీప్కే ప్రకటించారు. దాంతో నవంబర్ ఒకటి ఢిల్లీ వీధులు హోరెత్తి వేడెక్కిపోతాయా అన్న చర్చ మొదలైంది.

అనుభవంతో ఆవేశం :

కాంగ్రెస్ తో పాటు ఇండియా కూటమి పార్టీలకు రాజకీయంగా విశేషమైన అనుభవం ఉంది. ఇక సీజేపీకి ఆవేశం అంతటా ఉంది. జెన్ జీలకు కేరాఫ్ గా అసలైన వేదికగా సీజేపీ నిలిచి తొడ కొడుతోంది. అయితే అనుభవం లేకపోవడం వల్లనే అక్టోబర్ 10న జంతర్ మంతర్ వద్ద భారీ ఉద్యమాన్ని నిర్వహిస్తామని చెప్పి మరీ చేయలేకపోయింది. దీప్కే సహా కీలక నేతలను ముందస్తు గా అరెస్టు చేసి మరీ సీజేపీ ఆవేశాన్ని అలా అణచివేశారు. దాంతో సరైన సమయం కోసం సీజేపీ చూస్తోంది. ఇక సీజేపీ నేతలను అరెస్ట్ చేసి జైలులో పెడితే రాహుల్ గాంధీ వారికి మద్దతుగా మాట్లాడారు. దాంతో సీజేపీ కాంగ్రెస్ ల మధ్య కొత్త స్నేహం ఏర్పడింది. అది ఇపుడు మరి కాస్తా ముందుకు సాగి కాంగ్రెస్ కి మేము సపోర్ట్ అని సీజేపీ ఓపెన్ గానే ప్రకటించగలిగింది.

జ్ఞానేశ్ దిగిపోవాలి :

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ పదవి నుంచి దిగిపోవాలని సీజేపీ డిమాండ్ చేస్తోంది. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ పేరుతో ఓట్లు తొలగించే కార్యక్రమం చేస్తున్నారు అని మండిపడింది. సర్ ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేసింది. పాలకులు ఎవరో ప్రజలదే నిర్ణయం అని వారి తీర్పు శిరోధార్యం అని సీజేపీ అంటోంది. అంతే తప్ప ఎవరెవరు ఓటు వేయాలి అన్నది ప్రభుత్వం నిర్ణయించరాదు అని సీజేపీ స్పష్టంగా చెబుతోంది. అర్హులైన ఓటర్ల ఓట్ల కోసం పోరాటం చేస్తామని చెబుతోంది. ఎన్నికల సంఘం మీద నమ్మకం కలగాలీ అంటే జ్ఞానేశ్ కుమార్ పదవి నుంచి దిగిపోవాలని సీజేపీ కోరుతోంది.

సీజేపీ కలిస్తే :

ఇదిలా ఉంటే సీజేపీకి చెందిన నేతలు ఇండియా కూటమితో పాటు కాంగ్రెస్ తో కలసి ప్రత్యక్ష పోరాటాలలో పాల్గొంటారా అన్నది ఒక చర్చ. నిజంగా వారు కలిస్తే మాత్రం మరింతగా విపక్ష ఉద్యమాలు వేడెక్కడం ఖాయమని అంటున్నారు. సీజేపీకి జంతర్ మంతర్ ఉద్యమం సక్సెస్ ట్రాక్ రికార్డ్ ఉంది. విపక్షాలు ఎన్నో ఉద్యమాలను నిర్మించి ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టిన నైపుణ్యాన్ని కలిగి ఉన్నాయి. మరి ఈ విధంగా కొత్త సమీకరణలతో ముందుకు వస్తే అధికార ఎన్డీయే కూటమికి ఇది ఇబ్బందిగా ఉంటుందా అంటే వేచి చూడాల్సిందే. నవంబర్ 1న జరిగే ఇండియా కూటమి ర్యాలీలో పది లక్షల మందికి పైగా జనాలు పాల్గొంటారు అని అంటున్నారు. ఆ బిగ్ నంబర్ కనుక జత కూడితే చరిత్రలో నిలిచిపోయే అతి పెద్ద ఉద్యమమే అవుతుందని అంటున్నారు. దానితో పాటు సీజేపీ సహా జెన్ జీ యువత కూడా ఈ వైపున ఉవ్వెత్తున కదిలితే కాంగ్రెస్ సహా ఇండియా కూటమికి నూతన యవ్వనం వచ్చినట్లే అంటున్నారు. కుర్రాళ్ళ వేడి పెద్దల వాడితో ఎన్డీయేని కదిలిస్తారా అన్నది కూడా చర్చగా సాగుతోంది.

Edited, Printed, Published & owned by KOTAGIRI CHANDRA SHEKAR, Published From, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001, Printed at KOTAGIRI GRAPHICS & KOTAGIRI OFFSET PRINTER, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001. Editor: KOTAGIRI CHANDRA SHEKAR, RNINo. TELTEL/2022/86880, Cell:9440164140